వార్త

mohan PUBLICATIONS

ఆదివారం

2 అక్టోబరు 2016

ఆధ్యాత్మిక, జ్యోతిష,
వాస్తు, ఆరోగ్యాది అనేక
విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం
Granthanidhi.
blogspot.in

నీ సన్నిధి-మా పెన్నిధి!

తిరుమల బ్రహ్మోత్సవ సంరంభం

బొద్దుగుమ్మలు హైదరాబాదీలే

సినిమానే బిజినెస్‌గా ఎంచుకున్న వాళ్లు మాత్రం అందులో కలిసొచ్చే ప్రాంతంలో ఆయా వ్యక్తులు సొంత ఇళ్లనుకొనుక్కోవటమో, స్వయంగా నిర్మించుకోవటమో చేస్తుంటారు. తాజాగా రకుల్‌ప్రీత్‌సింగ్, రాశి ఖన్నాలు ఇద్దరూ హైదరాబాద్‌లో ఇళ్లను కొనుక్కున్నారు.. రాశీఖన్నా ఇల్లు తీసుకోవటమే కాకుండా కుటుంబాన్నంతా హైదరాబాద్ మార్చేశారట.. ఈమె హైదరాబాదీల సరసన ఎంత ఒదిగిపోయిందంటే.. తనకు ఎపుడు మీడియాతో ముచ్చటించే అవకాశం వచ్చినా తాను హైదరాబాదీనే అంటూ చెబుతూ ఉంటుందీ బొద్దుగుమ్మ..

తారాతీరం

కాంపిటిషన్ ఇచ్చే రేంజ్‌కి..

బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లో చెలరేగిపోతోంది.. అన్ని యాంగిల్స్ లోనూ హాలీవుడ్ భామలకు టఫ్ కాంపిటిషన్ ఇచ్చే రేంజ్‌లో వెలిగిపోతోంది.. ఈమెకు విపరీతమైన గుర్తింపు తీసుకొచ్చిన హాలీవుడ్ సీరియల్ క్వాంటికో ఇపుడు సీజన్-2 మొదలైపోయింది.. మొదటి సిరీస్‌లో సింగిల్ పీస్ బికినీలో అదరగొట్టిన పిసి రీసెంట్‌గా ప్రదర్శితమైన క్వాంటికో సీజన్-2 ప్రీమియర్‌లో టూ పీస్‌తో పిచ్చెక్కించేసింది.. ఈ భామ ఇలా కన్పించటం తొలిసారి కావటంతో.. అభిమానులు అందరూ నోళ్లు వెళ్లబెట్టి చూసుకోవాల్సి వచ్చిందట.

ఆషామాషీ కాదు

తమన్నా కెరీర్‌లోనే మొట్టమొదటి సారిగా అభినేత్రి వంటి త్రిభాషా చిత్రంలో నటించింది.. మిల్కీ బ్యూటీ అందుకు చాలా కష్టాలు అనుభవిస్తుంది పాపం తమన్నా.. తమన్నా అభినేత్రి అనే త్రిభాషా (తమిళ, హిందీ, తెలుగు) చిత్రంలో నటించేందుకు చాలా చాలా కష్టపడిందట.. అనుకో కుండా అభినేత్రి వంటి త్రిభాషా చిత్రంలో నటించాల్సి వచ్చింది.. ఇటువంటి త్రిభాషా చిత్రాలను ఇంక ఎపుడూ ఒప్పుకుని చేయను.. అచిచెబుతోంది తమ న్నా.. మూడు భాషల్లో తీసే చిత్రాల్లో నటించటం చాలా కష్టంతో కూడుకున్న విషయంగా ఆసినిమాలో నటించిన తర్వాత తెలిసింది.. మూడు భాషల్లోనూ ఆపాత్రకు అనుగుణంగా పాత్ర తీరుతెన్నులకు తగిన విధంగా నటించటం అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదంటోంది తమన్నా..ఈచిత్రం 58 రోజుల్లోనే పూర్తిఅయ్యింది అంటే ఏ లెవల్లో కష్టపడాల్సి వచ్చిందో ఒక్కసారి అర్థం చేసుకోండి అంటూ వెల్లడించింది.

కె.సురేష్ బాబు

ఆదివారం వార్త

2 అక్టోబరు 2016

మంచి ముత్యాలు

గులాబీ బోధ చేయదు. పరిమళాన్ని గుబాళిస్తుంది. అలాగే అధ్యాపకుడు తన జీవిత పరిమళంతో బోధించాలి.

-మహాత్మా గాంధీ

విషయ విశేషం

'సంఘీ'భావం
బాలస్త్రీల బరువు తగ్గేదెప్పుడు?..5
మూడో కన్ను
వాతలే మేలు.... 6
కవర్‌స్టోరీ
నీ సన్నిధి-మా పెన్నిధి!
తిరుమల బ్రహ్మోత్సవ సంరంభం...8
శ్రీహరివాసంలో శ్రీవారి సేవకులు.18
కథ
అన్నయ్య..20
ఈవారం కవిత్వం
కవి జీవి(కాగి)తం....23



చిత్రభారతి
చెక్కు చెదరని అమితాబ్
సింహాసనం..30
ఇంకా..కృతి, ముగ్గ, నవ్వుల్..రువ్వుల్,
వాస్తు వార్త, పదమథనం ..వారఫలం..
వగైరా... వగైరా.

లేఖలు

ప్రపంచ పరిస్థితికి అద్దం పట్టింది..

సెప్టెంబరు 18 వార్త ఆదివారం అనుబంధంలో 'ప్రమాదం అంచుల్లో ప్రపంచ శాంతి!' కవర్ స్టోరీ నేటి ప్రపంచ పరిస్థితులకు అద్దంపట్టింది. శాంతి స్థాపనకు కలిసికట్టుగా కృషిచేయవలసిన అవసరం ఎంతో ఉంది. 'కథ కంచికి' కవిత బాగుంది. నవ్వుల్-రువ్వుల్ బాగుంటోంది.

-పక్కి రాధా గోపాలకృష్ణ, విశాఖపట్నం.

ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ...

సెప్టెంబరు 18 వార్త ఆదివారం అనుబంధంలో కవర్ కథనం 'ప్రమాదం అంచుల్లో ప్రపంచ శాంతి' అంతర్జాతీయ ప్రపంచశాంతి దినోత్సవం గురించి, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నెలకొన్న హింస గురించి చక్కగా వివరించారు. ప్రపంచశాంతికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి. విద్యార్థి దశనుంచే శాంతి ప్రాధాన్యతను గుర్తించేట్లు చేయాలి. మీకు మా ధన్యవాదాలు.

-సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం.

ఆలోచింపజేసే, ఆకట్టుకునే ఆర్టికల్స్..

సెప్టెంబరు 18 వార్త ఆదివారం అనుబంధంలో భావవీచికలో..వివిధ రాష్ట్రాల మధ్య వివిధ అంశాలపై నెలకొన్న వివాదాలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలిగాని విధ్వంసాలకు పాల్పడ కూడదని చక్కగా వివరించారు. తోట రామ్మోహన్ కార్టూనులు విభిన్న ఇతివృత్తాలతో అలరిస్తు న్నాయి. తెలుగునాటకరంగంలో చిరస్థాయిగానిలిచిన స్థానం నరసింహారావు గురించిన వ్యాసం మమ్మల్నెంతగానో అలరించింది.

-ఎం.కనకదుర్గ, తెనాలి.

సంచిక మాకెంతో నచ్చింది..

సెప్టెంబరు 18 వార్త ఆదివారం సంచికలో 'భావవీచిక' చదివి కొంతమందైనా మూర్ఖత్వాన్ని వీడి, వివాదాలకు స్వస్తిచెపుతారని భావిద్దాం. ప్రస్తుత ప్రపంచానికి కవర్‌స్టోరీ ప్రతీకగా నిలిచింది. 'అమ్మకు ప్రేమతో..'స్ఫూర్తిదాయకంగా ఉంది. 'సంఘీ'భావంలో తెలిపినట్లు జెండర్ ఛాంపియన్లు రావాలని కోరుకుంటున్నాం.

-అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్.

మేగజైన్ ముచ్చటగా ఉంది..

సెప్టెంబరు 18 వార్త ఆదివారం సంచికలో భావవీచిక వాస్తవికంగా, సంఘీభావం అదర్శవంతం గా ఉంది. కవర్‌స్టోరీ ఆలోచింపజేసింది. 'కథ కంచికి' కవిత భావగర్భితంగా ఉంది. చిత్రభారతి ఎన్.టి.ఆర్.అభిమానులకు మంచి కిక్కిచ్చింది.ఫొటో ఫీచర్స్ అలరించాయి.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్టణం.

భావ వీచిక

భావిపౌరులు- బాపూజీ

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ! భారతీయులకే కాదు యావత్ ప్రపంచానికే గొప్ప స్ఫూర్తిమూర్తిగా నిలిచిన మహ నీయుడు. ఆయనను రేపటితరానికి కేవలం జాతిపిత అంటూ రెండుముక్కల్లో పరిచయం చేయటంతో మన పని అయిపోయిందను కుంటే పొరపాటు. ఆనాటి మన దేశ దుస్థితిని, గాంధీజీ జీవితానుభవాలను, ఆయన నిస్వార్థంగా, త్యాగనిరతితో, సత్యాగ్రహమే ఆయుధంగా స్వాతంత్ర్య పోరాటం సాగించిన రీతిని భావిపౌరులకు అర్థమయ్యేట్లు తెలియజెప్పాలి. గాంధీజీ కేవలం తన మాటతో, చేతతో ప్రజలను ఆకట్టుకుని, సకల భారతదేశాన్ని ఒక తాటిపై నడిపించేలా చేయడం మామూలు విషయం కాదు. ఆయన బాల్యం సైతం నేటి బాలలకు గొప్ప ప్రేరణనిస్తుంది. టీచర్ అబద్ధం చెప్పమన్నా చెప్పని సాటిలేని విద్యార్థి ఆయన. 'హరిశ్చంద్రుడు, శ్రవణ కుమారుడు' నాటకాలు చూసి ప్రభావితుడై సత్యపాలన, తల్లిదండ్రుల సేవ అంశాలను ఆనాడే ఒంటపట్టించుకోవటం.. మాంసం తింటే శారీరకంగా బలవంతులవుతారన్న స్నేహితుడి మాటలకు ఆకర్షితుడై, అలా బలం పొందితే తద్వారా ఆంగ్లేయులను తరిమికొట్టవచ్చను కోవటం.. బాలగాంధీకి ఆ ప్రాయంలోనే ఎంతటి దేశభక్తి! కొన్నాళ్లు ఇంట్లో తెలియకుండా బయట మాంసాహారం తినడం.. అయితే తల్లిదండ్రులను మోస గిస్తున్నానన్న భావన, జీవహింస చేస్తున్నా నన్న భావనలతో మాంసాహారం మానేయ టం.. ఇవన్నీ కూడా ..ఆయన ఆలోచనా రీతికి దర్పణాలు. భారతీయులు మాత్రమే కాదు, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జార్జ్ బెర్నార్డ్ షా, నెల్సన్ మండేలా, పెరల్ యస్.బక్, దలైలామా, ఆంగ్‌సాన్ సూకీ, స్టీవ్ జాబ్స్, ఒబామా.. ఇలా ఒకరా, ఇద్దరా.. ఎందరెం దరో ప్రపంచ వ్యాప్తంగా గాంధీజీ బోధన లకు, ఆయన జీవనశైలికి ప్రభావితులైన వారే. హరిజనోద్ధరణ, గ్రామాభ్యుదయాలకు ఆనాడే గాంధీజీ నాందిపలికారు. నిరాడంబర తకు గాంధీజీ నిలువెత్తుప్రతీక. మానవతకు మారుపేరుగా నిలిచిన మహాత్ముడు సర్వ కాలాలకు, సర్వులకు ఆదర్శప్రాయుడు. గాంధీ జయంతి అయిన నేటి రోజున యావత్ ప్రజ గాంధీజీ చూపిన శాంతి పథాన్ని స్మరణకు తెచ్చుకోవటం, ఆ బాటను నడవటం తక్షణ ఆవశ్యకత!

ఈ వారం కార్టూన్స్





'సంఘీ'భావం

బాలక్రీస్తుల బరువు తగ్గేదెప్పుడు?

దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూళ్లలో విద్యార్థుల వీపులపై విమానంమోత మోగిస్తున్న పుస్తకాల బరువుపై ఎన్ని అధ్యయనాలు వెలువడినా, ఎన్ని కమిటీల సిఫారసులు వచ్చినా క్షేత్రంలో మాత్రం పరిస్థితి ఏమాత్రం మారడం లేదు.

హైస్కూళ్లలో పరిస్థితి పక్కన పెడితే, నర్సరీ స్కూళ్లకు వెళ్లే చిన్నారులపై కూడా అసాధారణ బరువును అమానవీయంగా రుద్దుతూనే ఉన్నారు. ఏ విద్యార్థి పుస్తకాల బ్యాగు బరువు 6 కేజీలకు మించకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు జారీ చేసినా, 1993లో యశ్‌పాల్ కమిటీ బరువు లేని వినూత్న విద్యా విధానాలు ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు ఇచ్చినా చిన్నారులపై భారం పెరగడమే తప్ప తరగడం లేదు.

ఇటీవల సిబిఎస్ఇ అకడమిక్స్, ట్రెనింగ్ డైరెక్టర్ కెకె చౌదరీ అన్ని స్కూళ్లకు కచ్చితంగా పాటించాల్సిందిగా ఓ సర్క్యులర్ పంపారు. నర్సరీ, ఒకటి, రెండో తరగతుల పిల్లలకు స్కూల్స్ బ్యాగ్స్ ఉండకూడదని, వాళ్లకు ఎలాంటి హోంవర్క్ ఇవ్వకూడదని సర్క్యులర్‌లో ప్రిన్సిపళ్లను ఆదేశించారు. ఇంకా ఆ తరగతుల పిల్లలకు టీచర్లు, ప్రిన్సిపాళ్లు తాగే సురక్షితమైన మంచినీటిని స్కూల్లోనే అందివ్వాలని కూడా అందులో ఆదేశించారు. తాను ఇచ్చిన సర్క్యులర్‌పై స్కూల్లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అమలు తీరుపై వారాంతంలో నివేదిక ఇవ్వాలని తన కింది స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు. సహజంగానే ఇలాంటి ఆదేశాలు మార్గదర్శకాలను కాగితాలపై చూడడమే తప్ప అమలు ఎలా ఉంటుందో తెలియని తల్లిదండ్రులు దీన్ని కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎందుకంటే ఎవరు ఎన్ని చెప్పినా ఇప్పటివరకు ఎక్కడా విద్యార్థులపై భారం తగ్గే చర్యలు ప్రారంభం కాలేదు. అందుకే తల్లిదండ్రులకు కొత్త సర్క్యులర్ అమలుపై ఎప్పట్లా సందేహాలు ఉన్నాయి. అయితే ఈసారైనా ఈ సర్క్యులర్ అమలై మన పిల్లలపై గాడిదభారం తగ్గాలని మనమంతా ఆశిద్దాం.

స్కూలుకు వెళ్లే చిన్న పిల్లలు తమ స్కూలుబ్యాగ్‌లో పుస్తకాలే కాకుండా నోట్స్, సప్లిమెంట్స్, కంపాస్ బాక్స్, లంచ్ బాక్స్ దానికి అదనంగా వాటర్ బాటిల్... ఇవన్నీ కలిపితే ఎవరికైనా ఎనిమిది కేజీలకు బరువు తగ్గదు. ఈ బరువు చాలదన్నట్లు విద్యార్థులు మోతబరువుతో పట్టణాల్లో ఇంటినుంచి స్కూలుకు క్షేమంగా వెళ్లటం ఒక ఎత్తయితే అక్కడ స్కూలుకు వెళ్లిన తరువాత రెండు, మూడు ఫ్లోర్లలో ఉన్న తరగతి గదులకు వెళ్లడం మరో ఎత్తు. ఈ బరువును ఎత్తుకుని వెళ్తున్న చిన్నారులను చూసి గతంలో బాలక్రీస్తులంటూ ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. నిజానికి ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారం విద్యార్థి బరువును 15 శాతానికి మించి పుస్తకాల బరువు ఉండకూడదు. ఉంటే ఆ విద్యార్థులకు నడుమునొప్పి, వెన్నునొప్పి, కండరాల నొప్పి, స్పాండిలైటిస్, నీరసం వంటి అనారోగ్యం సంక్రమించే అవకాశాలు అధికమని ఆ నిపుణులు ఎప్పుడో హెచ్చరించారు. గతంలో నిర్వహించిన అనేక ఆరోగ్య సర్వేల్లో స్కూలు విద్యార్థుల్లో పుస్తకాల భారంతో 50 శాతందాకా వెన్ను నొప్పితో బాధపడుతున్నారని వెల్లడైంది. అందుకే విద్యార్థులపై భారం తగ్గించేలా "బిగ్ బ్యాగ్ బ్యాడ్ బ్యాక్" "సేవ్ మై బ్యాక్", "లెర్నింగ్ వితవుట్ బర్డెన్" లాంటి నినాదాలతో మహారాష్ట్రలో ఉదయ్ అనే ఎన్.జి.ఓ. ఫౌండేషన్ ఉద్యమమే నిర్వహించింది. అయినా స్కూలు నిర్వాహకులకు, టీచర్లకు, పాలకులకు ఇవన్నీ చెవిటివాళ్లముందు శంఖుమూదినట్లుగానే మిగిలిపోతున్నాయి.

అభివృద్ధి చెందిన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు అధునాతన టెక్నాలజీని వినియోగిస్తూ అసలు పుస్తకాల భారమే లేని ఈబుక్స్, ఐప్యాడ్స్‌ను ప్రవేశపెట్టాయి. మరికొన్ని దేశాలు పుస్తకాలు తప్పనిసరైతే స్కూళ్లలోనే లాకర్ల విధానాన్ని ప్రవేశపెట్టాయి. మరికొన్ని దేశాలు ఆడియో, విజువల్ ద్వారా బోధన చేస్తున్నాయి. మరికొన్ని దేశాలు హోంవర్క్‌ను కూడా ఆన్‌లైన్‌లో ఇస్తూ స్వీకరిస్తున్నారు. కానీ భారత్ లాంటి దేశాల్లో ఇప్పటికీ స్కూలుబ్యాగ్‌లు ట్రాలీ బ్యాగ్‌లుగా మారుతున్నా ఏ ఒక్కరిలో చిన్నారుల బ్యాగుల వెతపై కనికరం కనిపించడం లేదు. గతంలో పలుమార్లు రాజ్యసభలో విద్యార్థుల పుస్తకాల భారంపై ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. అసలు విద్యార్థులు పుస్తకాలతో రాని విద్యావిధానంపై చట్టం తీసుకురావాలని సూచనలు వచ్చాయి. విద్యార్థులపై భారం మోపే స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం తేవాలని పార్లమెంట్ సభ్యులు స్పీకర్‌ను కోరారు. కానీ ఇవన్నీ కాగితాలకు, చట్టసభల్లో చర్చలకు మాత్రమే పరిమితం కావడమే మన దురదృష్టం.

తాజాగా సిబిఎస్ఇ పుస్తకాల బరువుపై స్పందించి కఠిన సర్క్యులర్‌ను ఇవ్వడం సంతోషకరమైన పరిణామమే. కానీ ఇది ఎంతవరకు క్షేత్రస్థాయిలో అమలవుతుందన్నదే అందరికీ అనుమానాస్పదంగా మారింది. చట్టపరంగా చర్యలుంటాయన్న భయం లేకపోవడం, డబ్బుకోసం పలు రకాల ఎత్తుగడలు వేయడంతోనే ప్రైమరీ విద్యార్థుల స్కూలుబ్యాగు బరువు తగ్గడం లేదు. ఐటీ ఆధారిత టెక్నాలజీతో ఇప్పుడు అమెరికాలోని పనిని భారతదేశంలో రేయింబవళ్లు చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లోనే సమస్తం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. వాట్సప్‌లో ఉచితంగా ప్రపంచమే కుగ్రామంగా మారి కమ్యూనికేషన్ వేదికగా మారింది. ఇలాంటి తరుణంలో ఇంకా కాలం చెల్లిన విధానాలు కొనసాగించడం తీవ్రమైన విషయం. పాలకులు త్వరగా మేలుకొని త్వరగా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప బాలక్రీస్తుల భారం తగ్గే సూచనలు కనిపించడం లేదు.

ఒక ప్రైవేట్ రంగంలోనే కాకుండా ప్రభుత్వ రంగ స్కూళ్లలో కూడా పుస్తకాల భారం లేనివిధంగా ఆడుతూ పాడుతూ ఆహ్లాదంగా సాగే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలి. సిలబస్‌నే కాకుండా బోధనను కూడా విద్యార్థుల్లో ఏదో ఒక స్కిల్ పెంచే విధంగా వినూత్నంగా సాగే విధంగా. విద్యావిధానంలో సమూలంగా మార్పులు తీసుకురావాలి. ఇందుకు అసెంబ్లీలు, లోక్‌సభ, రాజ్యసభలు ముందుకు రావాలి. ఆచరణీయ విధానాలను అమల్లోకి తీసుకురావాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

వాతలే మేలు..

- ఎ.వి.వి. ప్రసాద్

దొంగ దెబ్బ తీయ దొరతనమైపోదు,
సైనికులను చంప శక్తి కాదు;
సిగ్గులేనిపాక్‌కు చెప్పుదెబ్బలె రైటు
విశ్వవినుత నామ! వినురవేమ!!

మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కి ఏడ్చినట్లుగా ఉంది పాక్ ధోరణి. యూరి సైనిక స్థావరంపై ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి పాక్ నాయకత్వం చేస్తున్న ప్రకటనలు, అక్కడి నుంచి వెలువడుతున్న స్పందనలు పరిశీలిస్తే అదే అభిప్రాయం కలుగుతుంది. కాశ్మీర్ సరిహద్దుల నుంచి ఉగ్రవాదులు చొరబడడం, వారిని మన సైన్యం దీటుగా ఎదుర్కొనడం మామూలే అయినా, తాజా ఘటనలో పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ సహా ఆ దేశానికి చెందిన పలువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అందుకే అందరిలో అంతటి ఆగ్రహం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాని షరీఫ్‌తోపాటు రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్, ఆర్మీ చీఫ్ రహీల్ షరీఫ్‌లు మరింత రెచ్చగొట్టే విధంగా చేస్తున్న వ్యాఖ్యలు వారు యుద్ధానికి కాలు దువ్వుతున్నారేమో! అనే అనుమానాన్ని కూడా కలిగిస్తున్నాయి. జనవరిలో పఠాన్‌కోట్ సైనిక స్థావరంపై జరిగిన దాడి తర్వాత ఉభయ దేశాల మధ్య సయోధ్యకు కొన్ని ప్రయత్నాలు జరిగిన మాట వాస్తవమే అయినా, వాటిని మళ్లీ ఊబిలోకి నెట్టివేస్తూ తాజా ఉగ్రదాడి జరిగింది. దానివెనుక పాక్ సైనిక హస్తం ఉన్నదో, ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నదో, లేక ఉగ్ర సంస్థల ప్రతీకార చర్య ఉన్నదో దర్యాప్తులో తేలవలసిన అంశమే అయినా షరీఫ్ వ్యాఖ్యలను, ప్రతిస్పందనలను బట్టి చూస్తే ఉగ్రదాడి వెనుక కచ్చితంగా పాక్ నాయకత్వ హస్తమే ఉన్నదనిపిస్తుంది.

అలా ఉన్నది గనుకనే నవాజ్‌షరీఫ్ ఐక్యరాజ్య సమితి వేదికపై అంతగా ఊగిపోయారు. భారత్‌కు వ్యతిరేకంగా ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టుకొనడానికి ఆయన చేసిన ప్రయత్నం వృధాప్రయాస కావడం గమనించవలసిన అంశం. చివరికి పాక్‌కు ఆప్తమిత్రుడుగా ఉండే అమెరికా సైతం ఆగ్రహాన్ని వెలిబుచ్చిందంటే పాక్ ఎలాంటి దుష్టమార్గంలో వెళ్తున్నదో అర్థమవుతుంది. చివరికి పాక్‌కు మాటసాయం చేసేవారు కూడా కరవయ్యారు. అయినా అదే బాట. దుష్ట వ్యూహాలతో పొరుగు దేశాలను ఆకట్టుకొనే చైనా వంటి కొన్ని దేశాలు మినహా పాక్‌కు మద్దతిచ్చేవారెవరుంటారు! సమితి 71వ జనరల్ అసెంబ్లీలో కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడానికి, యురీ ఘటనను ఆసరా చేసుకొని భారత్‌ను ఎండగట్టడానికి షరీఫ్ చేసిన యత్నం అందుకే విఫలమైంది. మన దేశంపై ఏదో ఒక రూపంలో దాడి జరపడానికి నిత్యం ప్రయత్నించేది వారే అయినా, తప్పు భారత్‌పై నెట్టడానికి పాక్ ప్రయత్నిస్తూంటుంది. ఇలా గతంలో సైతం పలుమార్లు జరిగింది. అందుకే చాలా తెలివిగా ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాలు జరగడానికి రెండు రోజుల ముందుగా యురీ దాడికి వారు ప్లాన్ చేసినట్లుగా కనిపిస్తుంది. కాశ్మీర్ రావణ కాష్టంలా రగులుతున్న సమస్యే అయినా, సమితి వేదికపై ప్రస్తావించడానికి తగినంత తాజా కారణమేదీ లేదు గనుకనే వారు యురీ దాడి వ్యూహం రూపొందించి ఉంటారని కూడా అనిపిస్తుంది. వారనుకొన్నట్లుగానే షరీఫ్ ఆ ఘటన నేపథ్యంలో భారత్‌పై విరుచుకు పడ్డారుగాని అది బూమరాంగ్‌లా ఆయన ముఖం బొప్పి కట్టేలా తగిలింది. సమితి సెక్రటరీ జనరల్ బాన్‌కి మూన్ సైతం 'కాశ్మీర్‌గాని, దానికి సంబంధించిన ఇతర అంశాలుగాని మీ ద్వైపాక్షిక సమస్యలు మాత్రమే. వాటిని చర్చల ద్వారా మీరే పరిష్కరించుకోవాలి. మేం జోక్యం చేసుకోలేం' అని ఘంటాపథంగా తేల్చి చెప్పారు. అసలు సమితి వేదికపై నుంచి షరీఫ్ రెచ్చగొట్టే ఆరోపణలు చేయడం ఒక తప్పయితే, వాటికి చైనా తానతందాన అనడం మరో తప్పు. ఈ విషయంలో చైనా మరోసారి భారత్ అంతర్గత వ్యవహారాల్లో అనవసరంగా తల దూర్చుతున్నదనే అనిపిస్తుంది. హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీని అమరవీరుడిగా కీర్తిస్తూ, కాశ్మీర్ స్వాతంత్ర్యం కోరుతున్న యువతను భారత్ ఆర్మీ చంపేస్తోందనీ, దానిపై స్వతంత్ర విచారణ జరగాలనీ షరీఫ్ సమితిలో చేసిన వ్యాఖ్యలకు తర్వాత చైనా మద్దతు ఇవ్వడం చూస్తే ఆ రెండు దేశాలు ముందుగా కూడబలుక్కొని భారత్‌పై విరుచుకుపడినట్లుగా అర్థమవుతుంది. ఆయన వ్యాఖ్యలపై స్పందించడానికి బాన్‌కి మూన్ వ్యతిరేకించినట్లుగానే అమెరికా, బ్రిటన్, జపాన్ తదితర దేశాధినేతలు, ప్రతినిధులు కూడా వ్యతిరేకించారు. నిజానికి ఇది చాలు.. పాక్ తాను చేస్తున్న తప్పు ఏమిటో గ్రహించుకొనడానికి. ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక దేశాల ప్రతినిధులైతే నేరుగా పాక్‌ను దుయ్యబట్టారు.

ఆ సమావేశానికి ప్రధాని మోడీ హాజరు కాలేదుగానీ హాజరైన విదేశాంగశాఖ సహాయ మంత్రి ఎం.జె. అక్బర్ మాత్రం చాలా ఘాటుగానే పాక్‌కు జవాబిచ్చారు. కాశ్మీర్‌లో మానవ హక్కులు మంట గలుస్తున్నాయని పాక్ చేసిన ఆరోపణకు అటువంటివేమీ లేవని సోదాహరణంగా ఆయన సమాధాన మిచ్చారు. అక్బర్ పాక్ ఆరోపణలను తిప్పికొడుతుంటే అనేక దేశాల ప్రతినిధులు హర్ష ధ్వానాలు ప్రకటించారు.

ఆ సన్నివేశం చూసిన తర్వాతనైనా షరీఫ్‌కు సిగ్గనిపించక పోవడమే విచిత్రం. అదే సమయంలో, పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని కోరుతూ కీలకమైన అమెరికా ఎంపీలిద్దరు ప్రతినిధుల సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. షరీఫ్ సమితి ప్రసంగానికి కొద్ది ముందు అమెరికాలో ఈ బిల్లు ప్రవేశ పెట్టడంపై జనరల్ అసెంబ్లీలో పలు దేశాలనుండి హర్షం కూడా వ్యక్తమైంది. రిపబ్లికన్ పార్టీ సభ్యులు టెడ్‌పో, డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు రోహ్రాబచర్ ఈ బిల్లును ఉమ్మడిగా ప్రవేశపెట్టినపుడు మిగిలిన ఇరు పార్టీల

పాక్ మాటలతో వినదు. తన ధోరణినీ మార్చుకోదు. కాశ్మీర్‌పై వేసిన కన్నును పక్కకు తిప్పుకోదు. ఆ నేపథ్యంలో ఉగ్రవాదులను ప్రేరేపించి దాడులను జరిపిస్తూనే ఉంటుంది. దానిని సమర్థంగా తిప్పికొట్టాలంటే మన దేశం కూడా తగిన విధానాన్ని, వ్యూహాన్ని రూపొందించుకోవలసి ఉంటుంది. శత్రువు బలమెంతో, బలగమెంతో తెలిసినప్పుడు అతడిపై లేచిందే పరుగ్గా ప్రతిదాడికి దిగడంకంటె ముందుగా అతడిని బలహీనపరచడానికి ప్రయత్నించడం చాలా అవసరం. శత్రువు బలహీనపడుతున్నాడని గ్రహించగానే అతడిని బందీని చేసే చర్యలు ఆరంభించాలి. అలా అయితేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. కేవలం దౌత్య పద్ధతిలో శత్రువును ఎదుర్కొనడమంటే అది ప్రతిసారి ఫలించక పోవచ్చు. అందుకే కొత్తతరహాలో ప్రతిదాడులకు వ్యూహం రూపొందించవలసి ఉంటుంది.

సభ్యులలో చాలా మంది మద్దతు పలకడం చూస్తే పాక్‌కు ముందు ముందు అమెరికా సాయం తగ్గిపోగలదనే అనిపిస్తుంది. పాక్‌కు ఇలా సమితిలో దెబ్బ మీద దెబ్బ తగిలింది. భారత్‌ను ఇరకాటంలో పెట్టాలని చూసిన షరీఫ్‌కు తానే ఇరుకున పడ్డట్లయింది. చైనా ప్రధాని కెకియాంగ్ మినహా మిగిలిన ప్రతినిధు లెవరూ షరీఫ్‌కు ఎలాంటి మద్దతు ఇవ్వకపోవడంతో ఒక విధంగా పాక్ సమితిలో ఒంటరిగా నిలబడినట్లు కనిపిస్తుంది. అయినా పాక్ 'ఉగ్ర' ఉరుములు తగ్గకపోవడం, ఆ దేశం అసలు నైజాన్ని బట్టబయలు చేస్తోంది.

****

పాక్‌తోగల సరిహద్దులవద్ద నిజానికి ఎప్పుడూ తీవ్ర ఉద్రిక్తతే నెలకొని ఉంటుంది. అక్కడినుంచి భారత్‌లోకి చొరబడడానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటారు. ఇరు దేశాల మధ్య ఉన్న 778 కిలోమీటర్ల నియంత్రణ రేఖ వద్ద సైన్యం ఎంతో అప్రమత్తంగా ఉంటుంది. శతఘ్నిదళాలు వేయికళ్లతో అణు వణువును నిశితంగా పరిశీలిస్తుంటాయి. అయినా చొరబాట్లు జరుగు తూనే ఉంటాయి. హోరాహోరీ పోరు కూడా సాగుతూనే ఉంటుంది. ఈ పోరులో సైనిక దళాలకూ కొంత నష్టం జరుగుతూంటుంది. కానీ ఉగ్రవాదులు ఇలా దొంగదెబ్బ తీయడమే పాక్ క్షమించరాని నేరం. దాడి జరిపింది జైషే మహమ్మదా, లష్కరే తోయిబానా? అన్నది ప్రధాన సమస్య కాదు. ఎందుకంటే అలాంటి అనేకానేక ఉగ్ర సంస్థలు పాక్‌లో వేళ్లూనుకొని, ఆ దేశం అందిస్తున్న సహకారంతో బలంగా పెరిగి భారత్‌పై ఎప్పుడెప్పుడు దాడి జరపాలా? అని చూస్తుంటాయి. ఎనిమిదినెలల క్రితం పఠాన్‌కోట్ సైనిక స్థావరంపై జరిగిన ఉగ్రదాడికంటె యురీ దాడి చాలా పెద్దది. గత మూడు దశాబ్దాలలో భారత్ సైన్యంపై జరిగిన అతి దారుణమైన దాడి ఇదే. తమ స్థావరంపై సైనికులు విశ్రాంతి తీసుకొంటున్న సమయంలో సెప్టెంబర్ 17 తెల్లవారుజామున నలుగురు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలోకి చొరబడి, టెంట్లకు నిప్పు పెట్టి బాంబుల వర్షం కురి పించగలిగారంటే పాక్ ఉగ్రవాదులు ఎంత వ్యూహాత్మకంగా భారత్ వైపు కదులుతున్నారో అర్థమవుతుంది. పఠాన్‌కోట్ దాడిలో ఆరుగురు సైనికులు అమరులైతే, యురీ దాడిలో 18 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారు విసిరిన గ్రనేడ్లు అత్యంత శక్తిమంతమైనవనీ, పాక్ సైనికులవద్ద ఉండే పేలుడు పదార్థాలు ఉగ్రవాదుల చెంత ఉన్నాయంటే వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందుతున్నవో అర్థమవుతున్నదనీ అందుకే అక్బర్ సమితి ప్రసంగంలో చాలా ఘాటు గా చెప్పారు. హోరాహోరీ పోరులో ఆ నలుగురు ఉగ్రవాదులను సైనికులు మట్టుబెట్టినప్పటికీ ఆ దాడి మొదటిదీ కాదు, అలాగే చివరిదీకాదు కనుక పాక్ దుడుకుచర్యలను అడ్డుకొనడానికి మనదేశం కూడా వ్యూహాత్మక విధానమే అనుసరించవలసి ఉంది.

పాక్ మాటలతో వినదు. తన ధోరణినీ మార్చుకోదు. కాశ్మీర్‌పై వేసిన కన్నును పక్కకు తిప్పుకోదు. ఆ నేపథ్యంలో ఉగ్రవాదులను ప్రేరేపించి దాడులను జరిపిస్తూనే ఉంటుంది. దానిని సమర్థంగా తిప్పికొట్టాలంటే మన దేశం కూడా తగిన విధానాన్ని, వ్యూహాన్ని రూపొందించుకోవలసి ఉంటుంది. శత్రువు బలమెంతో, బలగమెంతో తెలిసినప్పుడు అతడిపై లేచిందే పరుగ్గా ప్రతిదాడికి దిగడంకంటె ముందుగా అతడిని బలహీనపరచడానికి ప్రయత్నించడం చాలా అవసరం. శత్రువు బలహీనపడుతున్నాడని గ్రహించగానే అతడిని బందీని చేసే చర్యలు ఆరంభించాలి. అలా అయితేనే పరిస్థితి అదుపు లోకి వస్తుంది. కేవలం దౌత్య పద్ధతిలో శత్రువును ఎదుర్కొనడమంటే అది ప్రతిసారి ఫలించకపోవచ్చు. అందుకే కొత్తతరహాలో ప్రతిదాడులకు వ్యూహం రూపొందించవలసి ఉంటుంది.

ప్రధాని మోడీ ఈ విషయంలో చాలా ఆచితూచి వ్యవహరిస్తు న్నట్లే కనిపిస్తుంది. రెండు సంవత్సరాల క్రితం తాను అధికారంలోకి వచ్చిన రోజునే తన అధికార నివాసంలోనే షరీఫ్‌తో తొలి చర్చలు జరిపారు. అప్పటినుంచి అనేక పర్యాయాలు ఏదో ఒక అంతర్జాతీయ వేదికపైనో, అమెరికాలోనో షరీఫ్‌ను కలుస్తూనే ఉన్నారు. ఒక సందర్భంలో భారత్‌కు తిరిగివస్తూ మార్గమధ్యంలో కరాచీలో దిగి షరీఫ్‌కు వ్యక్తిగతంగా బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపి వచ్చిన మోడీ దొరికిన ప్రతి సందర్భాన్ని ఉభయ దేశాల ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకే వినియోగిస్తున్నారు.

అయితే మనసులో ఒకటి... మాట ఇంకొకటి అన్నట్లుగా వ్యవహరిస్తున్న పాక్ సంబంధాల పునరుద్ధరణకంటె సమరశంఖం పూరించడానికే ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తుంది. తరచుగా ఏదో రూపంలో భారత్‌పై పాక్ ఇలా విరుచుకుపడడానికి బహుశా ఇదే కారణమని పిస్తుంది. యుద్ధానికే దిగితే కన్నుకు కన్ను, గన్నుకు గన్ను ఎలాగూ తప్పదు. ఆ విషయం పాక్‌కూ తెలుసు. కాశ్మీర్‌పై ఇక చర్చలద్వారా తానను కొన్న ఫలితం సాధించలేనని గ్రహిస్తున్న పాక్ అందుకే తరచుగా కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ విషయం జాగ్రత్తగా గమనిస్తున్న మన దేశం పాక్‌ను వీలైనంత ఒంటరిని చేయడానికి తొలుత చర్యలు తీసుకొంటున్నట్లుగా కనిపిస్తోంది. అమెరికా మద్దతు పాక్ కోల్పోతే దానివల్ల తొలుత కలిగేలా లాభం మన దేశానికే. ఈ విషయంలో ఒబామాను ఒప్పించడానికి మోడీ చాలా పర్యాయాలే ప్రయత్నించడంతోపాటు సఫలీకృతు లయ్యారనే చెప్పాలి. అందుకే దాదాపు 130 దేశాలు సమితి సమావేశంలో పాక్‌ను దూరంగా ఉంచాయి. పాక్ సమస్యలతో తమకు సంబంధం లేనట్లుగానే మాట్లాడాయి. దానిని బట్టి చాలా విషయాలే గ్రహించవచ్చు. షరీఫ్ ఎంత నోరు పారేసుకున్నా చైనా వంటి అతికొద్ది దేశాలు మినహా ఆయనకు మద్దతిచ్చేవారు ఉండరనీ, ఈ విషయంలో భారత్ అనుసరిస్తున్న వ్యూహం ఆశించిన ఫలితాలిస్తున్నదనీ భావించవచ్చు.

దీని తర్వాత 'సర్జికల్ దాడు'లకు భారత్ యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాని ప్రకారం భారత్ సైనిక దళాలు నియంత్రణ రేఖను దాటి వెళ్లి, నిర్దిష్ట లక్ష్యాలపై దాడులు చేసి వెంటనే వెనక్కి తిరిగి వచ్చేస్తాయి. ఇటీవల మయన్మార్‌లో నాగా ఉగ్రవాదులపై భారత్ దళాలు ఇటువంటి 'ఆపరేషన్'నే విజయవంతంగా నిర్వహించాయి. ఇదే పద్ధతిని అనుసరిస్తే పర్యవసానాలెలా ఉంటాయనే అంశంపై భారత్ సైన్యంలో ప్రస్తుతం చర్చ జరుగుతున్నట్లుగా చెబుతున్నారు. యుద్ధమే జరిగితే, దానివల్ల ఉభయ సైన్యాలకు, ఉభయ దేశాలకు నష్టం సమానంగానే ఉంటుంది. మనవద్ద ఉన్నట్లే, పాక్‌వద్ద కూడా ప్రస్తుతం అత్యంత శక్తిమంతమైన క్షిపణులు, యుద్ధ విమానాలు ఉన్నాయి. భారత్‌కంటె తక్కువ సంఖ్యలోనే పాక్‌వద్ద యుద్ధ విమానాలు ఉన్నా, చాలా శక్తిమంతమైనవి కావడంతో వాటిని ప్రయోగిస్తే మన దేశానికి జరిగే నష్టం చాలా అధికంగానే ఉంటుంది. అలాగే మన యుద్ధ విమానాలు పాక్‌కంటె అనేక రెట్లు శక్తిమంత మైనవి కావడంతో పాక్‌కూ అధికంగానే నష్టం సంభవిస్తుంది. అందుకే యుద్ధ మార్గాన్ని అనుసరించడం వదలి దౌత్య వ్యూహాన్ని రూపొందించుకొంటేనే ఉభయ దేశాలకు శ్రేయస్కరమవుతుంది.

తనది కాని కాశ్మీర్‌ను పాక్ కోరుకొంటూ నాటి జియా దుస్తంత్రాన్నే ఇప్పటికి అనుసరించే మార్గం నుంచి ఇకనైనా బయటకు వస్తే మోడీ చెప్పినట్లు ఆ దేశానికి చాలా మంచిది. కాశ్మీర్‌లోని మిలిటెంట్లకు పాక్ చేస్తున్న సాయంవల్ల భారత్‌కు జరిగే ముప్పుకంటె పాక్‌కే ఎక్కువ ముప్పు వాటిల్లుతుందన్న విషయం కూడా షరీఫ్ గ్రహించవలసి ఉంది. చైనా వంటి శక్తిమంతమైన దేశాలు గోడమీద పిల్లివాటం అనుసరించడం కూడా మంచిదికాదు. భారత్‌తో పైకి మైత్రి నటిస్తూ, అంతర్గతంగా పాక్‌కు చేయి అందిస్తున్న చైనా విధానంవల్ల ప్రాంతీయ అశాంతి పెరుగుతుందేగాని కలిగే లాభం ఏదీ ఉండదు. ఎందుకంటె ఇవాళ భారత్ కూడా అన్ని రంగాలతోపాటు రక్షణ పాటవంలోనూ అనేక రెట్లు ముందుకు దూసుకువెళ్తోంది. దక్షిణాసియాలో భారత్‌తో పోటీపడి నిలబడే ధైర్యం, సామర్థ్యం ఏ దేశానికీ లేవు. అందుకే పోరు నష్టం, పొందు లాభం అనే మార్గాన్ని అనుసరిస్తే అటు పాక్‌కే కాదు, దానికి మద్దతిచ్చే దేశాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ■

నీ సన్నిధి- మా పెన్నిధి!

తిరుమల బ్రహ్మోత్సవ సంరంభం..

కవర్‌స్టోరీ

పావులూరి పద్మనాభమ్
స్టాఫ్ రిపోర్టర్, తిరుమల.
ఫొటోలు:టి.శ్రీనివాసులు
స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుమల.

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన; వేంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి...అన్నాయి ఆదిత్య, భవిష్య పురాణాలు. ఈ విశ్వంలో వేంకటాద్రి (తిరుమల) కి సమమైన పవిత్ర స్థానం మరేదీ లేదని, వేంకటేశుడికి సమానమైన దైవం గతంలో లేదు, భవిష్యత్తులోను ఉండదని దీని అర్థం. 'వేంకటేశ' అంటే పాపాలను దహించే దైవం (వెన్=పాపం; కట=దహించు; ఈశ= దైవం). వేంకటాధీశుడు అందరి వేలుపు, తెలుగువారి ఇలవేలుపు. తిరుమలేశుడు తమ నుంచి మొక్కుబడిగా కేశాలను తీసుకొని క్లేశాలను బాపుతాడన్నది భక్తజన భావన. అంతటి బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు భక్తులకు నేత్రోత్సవాలు. అశేషభక్తులు బ్రహ్మోత్సవాలను కన్నులారా తిలకించి, మనసారా వెంకన్నను వేడుకునేందుకు తిరుమలకు చేరుకునే తరుణమిది. సప్తగిరీశుని బ్రహ్మోత్సవ వైభవ వివరం, ఏర్పాట్లు, సేవలు, తిరుమల క్షేత్ర వైశిష్ట్యం, తిరుమల సమీపంలోని వివిధ తీర్థాలు..తదితర విశేషాలతో కూడిన ప్రత్యేక కథనం ఈవారం మీకోసం..

**"వినా వేంకటేశం ననాథో ననాథ:!
సదా వేంకటేశం స్మరామి స్మరామి
హరే వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ!!**

అంటూ కోట్లాదిమందిభక్తులు వేడుకొనే దైవం, కలియుగవైకుంఠంగా ప్రఖ్యాతిచెందిన తిరుమలలో భక్తులను అనుగ్రహించడానికి వెలసిన దైవం శ్రీవేంకటేశ్వరుడు. ఏడుకొండలపై స్వయంభువుగా వెలసి అర్చనలందుకుంటున్న శ్రీవేంకటేశ్వరునికి వేడుకలుగా జరిగే ఉత్సవాలివి. తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాలలో రోజుకు రెండువాహనాలెక్కి దేవదేవుడు భక్తుల్ని మురిపించే బ్రహ్మోత్సవాలివి. వందల సంవత్సరాలుగా కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతున్న ఏడుకొండలపై జరిగే వైభోగమిది. కొండలలో నెలకొన్న కోనేటిరాయుడి "బ్రహ్మోత్సవ" వైభవం ఇది.

తిరుమలలో శ్రీనివాసుడు వెలసింది తమిళనెల పెరటాశిలో వచ్చే శ్రవణానక్షత్రం రోజున. అందుకే పెరటాశి నెలలో శ్రీవారు వెలసిన రోజుకు ముగించేలా శ్రవణానక్షత్రానికి తొమ్మిదిరోజులు ముందునుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. తిరుమలలో ప్రతిరోజూ వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం నిత్యార్చనలు జరుగుతున్నాయి. పూర్వం బ్రహ్మదేవుడు సాక్షాత్తు శ్రీనివాసునికి ఉత్సవం జరిపించారని, అందుకే వీటికి "బ్రహ్మోత్సవాలు" అని పేరు వచ్చిందని పురాణాల్లో పేర్కొనబడింది. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు తిరుమల కొండలు కలియుగ వైకుంఠంలా కాంతులీనుతుంటాయి.

ఈ తొమ్మిదిరోజులు తిరుమల దివ్యక్షేత్రంలో దారులన్నీ ఆ ఏడుకొండలకే అన్నట్లు మారిపోతుంటాయి. కోట్లాదిమంది భక్తుల 'గోవింద'నామ నినాదాలతో, వేద పండితుల వేదఘోష వినిపిస్తుంది. ఈ బ్రహ్మోత్సవ రోజుల్లో వర్ణించడానికి అలవికాని శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహరూపాన్ని ఒక్కక్షణమైనా దర్శించుకుని తరించడానికి వచ్చేసే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, సీనియర్ ఐఏఎస్ అధికారులైన కార్య నిర్వహణాధికారి, సంయుక్త కార్య నిర్వహణాధికారి, ఇతర అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించేలా స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. ధ్వజారోహణం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ధ్వజ అవరోహణంతో సమాప్తమవుతాయి. అంకురార్పణతో సాంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు పెద్దశేష వాహనంతో వాహనసేవలు ఆరంభమై తొమ్మిదవరోజు చక్రస్నానంతో వైభవోపేతంగా ముగుస్తాయి. అధికమాసం వచ్చిన సంవత్సరంలో తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతాయి. ఈ ఏడాది వార్షిక నవరాత్రి బ్రహ్మోత్సవాలు మాత్రం జరుగుతాయి.

అంకురార్పణ:

ఏడుకొండలపై వెలసిన దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు ముందురోజు రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణ-బీజావాపనం అత్యంత ముఖ్యమైంది. ధ్వజారోహణానికి ముందురోజు సాయంత్రం స్వామివారి సేనాధిపతి విష్వక్సేనులవారు

ఆలయ నాలుగు మాడవీదుల్లో ఊరేగింపుగా వెళ్ళి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. శ్రీవారి ఆలయానికి నైరుతిమూలలో వున్న వసంతమండపానికి చేరుకుని భూమిపూజ, మృత్స ంగ్రణం చేసి ప్రదక్షిణంగా వచ్చి ఆలయం లోనికి ప్రవేశిస్తారు. బ్రహ్మోత్సవాలు విజయ వంతం కావాలని కోరుతూ నవధాన్యాలతో అంకురార్పణం నిర్వహిస్తారు. బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శాంత, ఇంద్ర, ఇసాన జయ తదితర దేవతలను ఆహ్వానించి అగ్నిద్వారా పూజలు చేస్తారు. ఆ తరువాత సోమం రాజమంత్రాన్ని, విష్ణు సూక్తాన్ని పారాయణంచేసి, విత్తనాలు నాటి వరుణ మంత్రాన్ని పఠించి నీళ్ళుచల్లుతారు.

ధ్వజారోహణం:

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయి. వైఖానస ఆగమశాస్త్రోక్తంగా గరుడకేతన ప్రతిష్ట, కంకణధారణ, ఆలయ ఆవరణలోనూ బయట చుట్టూ అష్టదిక్కుల్లోనూ బలినిచేస్తూ శ్రీవేంకటేశ్వరస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ పరివార దేవతలతో ఊరేగుతూ అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తారు. దేవతలను ఆహ్వానించిన అనంతరం స్వామివారు ఆలయంలోకి ప్రవేశించి ధ్వజస్తంభం వద్దకు చేరుకుంటారు. పరివారదేవతలైన అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, అంగదులు విమాన ప్రదక్షిణంలో వున్న అంకురార్పణ మండపానికి చేరుకుని, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు, అర్చకులు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఇక్కడ పెసర పులగం (ముద్గలాన్నం) నివేదిస్తారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతాన భాగ్యానికి నోచుకోని స్త్రీలు సంతానవంతులవుతారని విశ్వాసం.

పెద్దశేషవాహనం:

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి ఆదిశేషునిపై శ్రీవారు కన్నుల పండువగా కటాక్షిస్తారు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరంలో బలరాముడిగా, శ్రీమన్నారయణుడి శయ్య అయిన పెద్ద శేషుడిపై ఊరేగుతారు. ఏడుతలల బంగారు శేషుడే స్వామివారి పెద్దశేషవాహనం. భూభారాన్ని వహించే ఈ శేషుడే శ్రీదేవి,భూదేవి సమేత మలయప్పస్వామితో తొలిరోజు తిరుమాడవీధుల్లో ఊరేగుతారు.

చిన్నశేషవాహనం:

బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు ఉదయం మలయప్పస్వామి ఐదు తలల చిన్నశేషునిపై దర్శనమిస్తారు. నాగజాతిలో అనంతుడిని, సర్ప జాతిలో వాసుకిని పేర్కొన్నారు. పెద్దశేషవాహనం ఆదిశేషుడిగా, చిన్న శేషవాహనం వాసుడిగా భావిస్తారు. కాలానికి ప్రతీక శేషవాహనం. కలియుగవైకుంఠవాసుడు, దేవదేవుడు మనలోనూ ఈ చరాచర ప్రపంచం మొత్తం వ్యాపించివున్నాడు. ఈ చరాచర సృష్టిలో దేవుడు కాలంలో వున్నాడు. మనలో మూలాధారంనుంచి సహస్రారం వరకు ఆయనే వ్యాపించివున్నాడని ఉపనిషత్తులు.. యోగశాస్త్రాలు చెబుతు న్నాయి. చేతిలో పిల్లనగ్రోవి ధరించి మురళీకృష్ణుడి అలంకారంలో ఐదుతలల చిన్నశేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు.

హంసవాహనం:

తిరుమలేశుని బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు రాత్రి మలయప్పస్వామి వీణాపాణియై సరస్వతీమూర్తిగా దర్శనమిస్తాడు. బ్రహ్మ వాహనమైన హంస ప్రసిద్ధం. పరమాత్మతో సంయోగం చెందిన మహనీయులను "హంస" అని ,"పరమహంస" అని వ్యవహరిస్తారు. శ్రీవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించడం ఆనందదాయకం.

సింహవాహనం:

తిరుమలలో అత్యంతవైభవంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు ఉదయం సిరిసంపదల దేవుడు శ్రీనివాసుడు సింహవాహనంపై దర్శనమిస్తారు. అనంత తేజోమూర్తి శ్రీవేంకటేశ్వరస్వామివారు రాక్షసుల మనస్సులలో సింహంలా గోచరిస్తాడని స్తోత్రవాఙ్మయం కీర్తిస్తుంది. శ్రీవిష్ణుసహస్ర నామాలలో స్వామికి నామాంతరంగా "సింహః" అని స్తోత్రం చేయడం జరుగుతుంది. సృష్టిలో ఇతర ప్రాణులకు లేని విశిష్టత సింహానికి వుంది. భగవంతుని అవతారాలలో నరసింహస్వామి అవతారం నాల్గవది. ధర్మరక్షణకై తాను నృసింహ స్వరూపాన్ని ధరించిన స్వామి ఈ ఉత్సవాలలో సింహాన్ని అధిష్టించి రావడం ...దుష్టజన శిక్షణకు, శిష్టజన రక్షణకు సంకేతం.

ముత్యపుపందిరివాహనం:

చల్లదనానికి ప్రతీక ముత్యం. శీతల పవనాలు గిలిగింతలు పెడుతుండగా ముత్యపు పందిరివాహనంపై శ్రీవారు భక్తజనానికి దర్శన భాగ్యమిస్తారు మూడవరోజు రాత్రి. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లని కాంతులీనుతాయి. వినీలనిర్మలాకాశంలో మిలమిలమెరిసే నక్షత్రాలతో పోటీపడుతూ విద్యుద్దీపకాంతులతో తళుకులీనే ముత్యాల పందిరి భక్తులకు కనువిందు చేస్తూ స్వామి ఆలయమాడ వీధుల్లో విహరిస్తారు. చల్లనిముత్యాలక్రింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుంది

కల్పవృక్షవాహనం :

కోరిన కోర్కెలు తీర్చే కొండలరాయుడు ఎంతోప్రీతిపాత్రమైన కల్పవృక్షవాహనాన్ని అధిరోహించి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు ఉదయం భక్తకోటిని అనుగ్రహిస్తాడు. కల్పవృక్ష మంటే కోరిన కోర్కెలు తీర్చే దేవతావృక్షం. క్షీరసాగరమథనంలో కామధేనువు, చింతామణి, లక్ష్మీదేవి మొదలైన దివ్యప్రతిమలతో పాటు కల్పవృక్షం కూడా ఉద్భవించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదించే కల్పవృక్షాన్ని వాహనంగా చేసుకుని ఆలయ మాడవీధుల్లో విహరిస్తారు. వేల్పు గాను..ఇలవేల్పుగాను....భక్తులను కటాక్షించి మీ కష్టాలు తీర్చడానికి నేనొచ్చానంటూ అభయ ప్రదానం చేస్తాడు. గోవులను కాపాడుతున్న గోపాలుని అలంకారంలో విశేషాభరణాలతో దివ్యంగా కటాక్షిస్తాడు.

సర్వభూపాలవాహనం:

సర్వభూపాలకులలో దిక్పాలకులు కూడా ఆదిదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని సుప్రభాతవేళ సేవిస్తారని అణ్ణన్‌స్వామి పురాణాల్లో పేర్కొన్నారు. భూపాలకులందరూ అధికార సంపన్నులే. నాల్గవరోజు రాత్రి మలయప్పస్వామి రాజమన్నార్ అవతారంలో సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. ప్రజలను రంజింపజేసేవారే రాజులు. విష్ణుం లేనివాడు రాజుకాలేడు. అందుచేత రాజులందరూ అంతో ఇంతో భగవదంశ కలవారే. వారు అంశలైతే, స్వామి అంశి.

గరుడవాహనం

మోహినీ అవతారం:

శృంగారరసాధిదేవతగా ఆపదమ్రొక్కులవాడు బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు ఉదయం మోహినీ రూపం ధరించి జగన్మోహనాకారుడైన శ్రీనివాసుడు భక్తులకు రమణీయంగా దర్శనమిస్తాడు. ప్రక్కనే స్వామి వారు దంతపు పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరోరూపంలో కన్నుల ముందుకు ఆలయంనుంచి విచ్చేస్తాడు. కమనీయమైన శ్రీకాంతుని రూపం జగత్సమ్మోహకంగా వుంటుంది. బ్రహ్మోత్సవాల్లో అన్ని వాహనాలు వాహనమండపం నుంచి బయలుదేరితే మోహినీ అవతారం మాత్రం శ్రీవారి ఆలయంనుంచి వెలుపలకు వచ్చి భక్తుల చేత కర్పూర హారతులు అందుకుని ఆలయ మాడవీధుల్లో ఊరేగడం విశేషం. సురాసురులు అమృతానికై క్షీరసాగరాన్ని మధిస్తారు. అందులో హేయమైన విషంతోబాటు ఉపాధేయమైన అమృతం, ఎన్నో మేలి వస్తువులూ ఉద్భవించాయి. వివిధ దేవతలు వాటిని స్వీకరించారు. చివరికి వారు కోరుకున్న అమృతం లభిస్తుంది. దానిని పంచుకోవడంలో కలహం తప్పలేదు. ఆ కలహాన్ని నివారించి అసురులను వంచించి సురలకమృతాన్ని పంచదానికి శ్రీహరి మోహినీరూపంతో సాక్షాత్కరిస్తాడు.

గరుడవాహనం:

శ్రీవారికి ఏడాదికోసారి జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవకు అత్యంత ప్రాధాన్యతవుంది. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజురాత్రి వేదపండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణలు చేస్తుండగా గరుడవాహనంపై శ్రీవారు విహరించడం జరుగుతుంది. జగద్విఖ్యాతిగాంచిన కలియుగవైకుంఠవాసుడు నెలకొన్న తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి గరుత్మంతుడు అత్యంతప్రీతిపాత్రుడు. తన వాహనాల్లో గరుడునికి ప్రాధాన్యత వుంది. శ్రీవారికి జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన వీక్షణానికి లక్షలాదిమంది భక్తులు తిరుమలకు చేరుకుని దర్శించుకుని ముక్తిని పొందడం పరిపాటి. అంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న గరుత్మంతుడు అలిపిరి వద్ద భక్తులను స్వాగతిస్తూ కొలువుదీరాడు. సప్త గిరుల్లో గరుత్మంతుని ప్రతిరూపం శిలగా వుంది.

హనుమంతవాహనం:

వరదహస్తం దాల్చిన వేంకటాద్రిరాముడు దాసభక్తికి ప్రతీకఅయిన భక్తాగ్రేసరుడు హనుమంతవాహనంపై మలయప్పస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు ఉదయం ధను ర్బాణాలు ధరించిన శ్రీరామచంద్రమూర్తి అవతా రంలో భక్తులను కటాక్షిస్తాడు. హనుమంతుడు భగద్భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతిస్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా, లంకాభీకరుడుగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటేశ్వరుని మూపునవహించి తిరువీధు లలో ఊరేగుతూ దర్శనమివ్వడం భక్తకోటికి హర్షోత్కర్షం ఆపాదిస్తుంది.

గజవాహనం:

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు రాత్రి గజవాహనంపై గజరాజ రక్షకుడు భక్తులను కటాక్షిస్తాడు. గజవాహనం అనాదినుంచి ప్రసిద్ధమే. పూర్వంయుద్ధాలలో రథగజాశ్వాలను వాహనాలుగా ఉపయోగించేవారు. రాజులను పట్టాభిషేకాది సమయాలలో గజాధిష్ఠితులను చేసి ఊరేగించేవారు. నేటికీ విశిష్ట వ్యక్తికి ఘన సన్మానంగా గజారోహణం కావించే ప్రక్రియ వుంది. స్వామి వైకుంఠంనుంచి విచ్చేసి మొసలి తలను ఖండించి గజేంద్రుని రక్షిస్తాడు. అందు వల్ల శరణాగతి ప్రక్రియలో గజేంద్రునికి గల ప్రాధాన్యం అనన్యసామాన్యమైంది. గజరాజును అధిష్ఠించిన శ్రీహరిని చూచినపుడు పురాణ ప్రసిద్ధమైన గజేంద్రమోక్షం గుర్తుకువస్తుంది.

సూర్యప్రభవాహనం:

శ్రీమన్నారాయణుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఉదయం శ్రీకృష్ణుడి అవతారంలో సర్వాంగసుందరంగా సూర్యప్రభవాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తాడు. సూర్యుడు తేజోనిధి. సకలరోగనివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత, వర్షాలు, వాటి వల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే

బ్రహ్మోత్సవ వేడుకలు ఇలా..

02.10.2016 – ఆదివారం
అంకురార్పణ

03.10.2016 – సోమవారం సాయంత్రం- ధ్వజారోహణం;
రాత్రి- పెద్దశేషవాహనం

04.10.2016 మంగళవారం
ఉదయం -చిన్నశేషవాహనం; రాత్రి -హంసవాహనం

05.10.2016 బుధవారం
ఉదయం- సింహవాహనం; రాత్రి -ముత్యపుపందిరి వాహనం

06.10.2016 గురువారం
ఉదయం- కల్పవృక్షవాహనం ; రాత్రి - సర్వభూపాలవాహనం

07.10.2016 శుక్రవారం
ఉదయం- మోహినీ అవతారం; రాత్రి - గరుడవాహనం

08.10.2016 శనివారం
ఉదయం- హనుమంతవాహనం; రాత్రి - గజవాహనం

09.10.2016 ఆదివారం
ఉదయం -సూర్యప్రభవాహనం; రాత్రి -చంద్రప్రభవాహనం

10.10.2016 సోమవారం
ఉదయం- రథోత్సవం ; రాత్రి అశ్వవాహనం

11.10.2016 మంగళవారం
ఉదయం- పల్లకీఉత్సవం, చక్రస్నానం; సాయంత్రం- ధ్వజావరోహణం

ఔషధులు మొదలైనవి సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అంతటి సూర్యప్రభను అధిష్టించి స్వామి తిరుమలలో ఊరేగడం ఆనందదాయకం. నిత్యం ఉదయం భారతీయులు సూర్యోపాసన చేయడం ఆనవాయితీ. సూర్యుడు సప్తాశ్వరథారూఢుడై నిత్యం విహరిస్తూ తన తేజస్సుతో లోకానికి చైతన్యం కలిగిస్తున్నాడు.

చంద్రప్రభ వాహనం

చంద్రప్రభవాహనం:

చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రకాంత మణులు స్రవిస్తాయి. అంతటి మహిమాన్వితమైన చంద్రుడ్ని వాహనంగా చేసుకుని బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు రాత్రి ఏడుకొండలవాడు సర్వజగద్రక్షకుడు వయ్యారంగా విహరించి భక్తులను కటాక్షిస్తాడు. స్వామి వారికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. చంద్రుడు భగవంతుని మారురూపమే. రసస్వరూపుడైన చంద్రుడై భగవానుడు ఓషధులను పోషిస్తున్నాడని అర్థం. ఆ ఓషధులు లేకపోతే జీవనం మనకులేదు. ఓషధీశుడైన చంద్రుడు మనకు పోషకుడే.

రథోత్సవం

రథోత్సవం:

'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అని ఆర్షవాక్కు. రథోత్సవం మోక్షప్రదాయకమని భక్తుల విశ్వాసం. దేవదేవుడు బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవరోజు ఉదయం మహా రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. శ్రీదేవిభూదేవిలతో కలసి మలయప్పస్వామి మహోన్నతరథంపై ఆలయ మాఢవీధులలో విహరిస్తూ మీ కోర్కెలు నెరవేర్చడానికి నేను వచ్చానంటూ భక్తులను కటాక్షిస్తారు. శ్రీహరి గరుఢధ్వజుడై నాలుగుగుర్రాలు పూన్చిన రథంపై విహరిస్తాడు. కలియుగవైకుంఠం తిరుమలలో రథోత్సవం అత్యంత ప్రసిద్ధమైంది.

అశ్వవాహనం:

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు రాత్రి స్వామివారు కల్కి అవతారంలో భక్తులను కరుణిస్తాడు. జంతువులలో మిక్కిలి వేగంగల జంతువు అశ్వం. అనాదిగా మానవుడు అశ్వాలను వాహనాలుగా వినియోగించాడు. ఆభగవంతుని అవతారాలు పది ప్రసిద్ధమైనవి. చివరి అవతారం కల్కి. కలియుగాంతంలో కల్కిరూపం ధరించి కత్తిచేతబూని అశ్వ వాహనంపై స్వామి దుష్టజన సంహారం చేస్తాడని పురాణాలు చెబుతున్నాయి. పద్మావతీ శ్రీనివాసుల తొలి చూపుల వేళ, ప్రణయవేళ, పరిణయవేళ సాక్షిగా నిలిచింది అశ్వమే.

చక్రస్నానం

చక్రస్నానం:

అంగరంగవైభవంగా తిరుమలకొండల్లో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదోరోజు ఉదయం చక్రస్నాన మహోత్సవంతో వైభవంగా ముగుస్తుంది. కోట్లాదిమంది భక్తుల పాపాలు శ్రీవారి పుష్కరిణిలో స్నానంతో తొలగిపోతాయని గరుడ పురాణంలో పేర్కొన బడింది. అంతటి మహాత్మ్యం వున్న స్వామివారి పుష్కరిణిలో జరిగిన చక్రస్నాన మహోత్సవం భక్త కోటిని పులకింప జేస్తుంది. అజ్ఞాతంలో ఆదరింపబడే అవభృథ స్నానమే. వరాహస్వామి ఆలయం పక్కనే వున్న స్వామి వారి పుష్కరిణిలో పవిత్ర స్నానాలాచరిస్తారు.

మూలవిరాట్టు) శ్రీవారి దివ్యరూపం:

ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి నిలిచివున్న దివ్యమంగళమూర్తి పవిత్ర శిలారూపం మూలవిరాట్టు. గర్భాలయంలో నిలబడి వున్నందున "స్థానకమూర్తి" అంటారు. స్థిరంగా వున్నందువల్ల "ధృవమూర్తి" అని, "ధ్రువభేరం" అని అంటారు. దేవదేవునితో నలుగురు మూర్తులు వున్నారు. శ్రీస్వామివారి మూర్తి అత్యంత విలక్షణమైన పద్ధతిలో దర్శనమిస్తూ భక్తులను కటాక్షించి ఆనందింపజేస్తున్నారు. సుమారు 8అడుగుల ఎత్తుగల ఈ మూర్తికి ప్రతిరోజూ రెండుమార్లు తోమాలసేవ (పుష్పా లంకరణ), మూడుమార్లు అర్చన, నివేదనలు జరుపబడుతాయి. ఇందులో స్నపన మండపం, రాముల వారిమేడ, శయన మండపం, శ్రీవారి గర్భాలయం వున్నాయి.

ఆదిదేవుని చెంత ఆద్యంతం స్వామివారి సేవకులుగానే ..

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామివారి సేవలో పలువురు కమిషనర్లు, కార్యనిర్వహణాధికారులు,ఛైర్మన్లు తరించారు. వీరంతా అధికారదర్పంతోగాక ఆద్యంతం స్వామివారి సేవకులుగానే సేవలందించారు. శ్రీవారి దర్శనార్థం ప్రపంచం నలుమూలలనుంచి విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు సంతృప్తికరమైన స్వామివారి దర్శనం, వసతి, అన్నప్రసాద వితరణ తదితర సౌకర్యాల కల్పనకు ఎప్పటికప్పుడు కార్యనిర్వహణాధికారులు కీలకమైన నిర్ణయాలు తీసుకుంటూ టిటిడి ఉన్నతికి కృషి చేస్తున్నారు. టిటిడిలో 1933నుంచి 1951 వరకు తొమ్మిది మంది కమిషనర్లు సేవలందించారు. 1951నుంచి ఇప్పటివరకు 24మంది కార్యనిర్వహణాధికారులు స్వామివారి ఆస్థానంలో పనిచేశారు. ప్రస్తుతం టిటిడిలో 48వ పాలకమండలి బాధ్యత వహిస్తుండగా ఇవోగా డాక్టర్ దొండపాటి సాంబశివరావు తనదైన శైలిలో 2014 డిసెంబర్ నుంచి అంకితభావ సేవలందిస్తున్నారు. సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం, బస, అన్నప్రసాదం అందించడం సులభతరం చేశారు. ఇదిలా వుండగా ప్రస్తుతం టిటిడికి 48వ ధర్మకర్తల మండలి బాధ్యతవహిస్తోంది. మండలి ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన మాజీఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి అధ్యక్షులుగా 17మంది సభ్యులు భక్తుల సేవకు విశేష కృషి చేస్తున్నారు.

ఏడు లోకాలకు ప్రతీకలు ఏడుద్వారాలు...

కలియుగవైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమల పుణ్యక్షేత్రంలో ప్రతి వీధి ఒక విశిష్టతను సంతరించుకుంది. వైకుంఠంలో కొలువైన శ్రీమహావిష్ణువు ఏడుద్వారాలు దాటిన తరువాత శేషపాన్పుపై శయనించివున్నట్లు కలియుగవైకుంఠంలో దేవదేవుడు శ్రీవేంకటేశ్వరుడు 7లోకాలకు ప్రతీకలుగా నిలిచారు. అంతటి 7 ద్వారాల మహత్యాన్ని, పవిత్రతను తెలియజేసేలా శ్రీవారి ఆలయానికి వెళ్ళే ప్రవేశద్వారమైన రాంభగీచా అతిధిగృహాల నుంచి వాహనమండపం వరకు విద్యుద్దీపాలతో ద్వారాలు కళ్ళకుకట్టినట్లు బ్రహ్మోత్సవాల్లో అలంకరిస్తారు. ఇవి ఎంతగానో భక్తులను ఆకట్టుకుంటాయి. అలంకారప్రియుడు శ్రీనివాసుడు. తిరుమల మాడవీధులు నవరాత్రి బ్రహ్మోత్సవాల శోభతో శోభాయమానంగా అలరారుతుంటాయి. శ్రీవారి వాహన సేవలో పాల్గొనడం భక్తులు మహదవకాశంగా భావిస్తారు. సకలపాపాలు హరించి, ఎప్పుడూ వెన్నంటి వుండే శ్రీవారు తమను ఆదుకుంటాడని, స్వామివారి వాహనసేవతో నడిచేందుకు భక్తులు ఉవ్విళ్ళూరుతుంటారు. తిరుమలలో ఏడులోకాలను తెలియజేసేలా ప్రతీకగా ఏర్పాటు చేసిన ఏడుద్వారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ద్వారాలు ఏర్పాటువెనుక ఓ విశిష్టతవుంది. ఏడుద్వారాల్లో- మొదటిద్వారం (భూలోకం), రెండవద్వారం (భువర్లోకం), మూడవద్వారం (సువర్లోకం), నాల్గవద్వారం (మహర్లోకం), ఐదవ ద్వారం (జనలోకం), ఆరవద్వారం (తపోలోకం), ఏడవద్వారం (వైకుంఠలోకం). ఈ ఏడులోకాలను దాటుకుంటూ వెళితేనే శ్రీమహా విష్ణువును చేరుకొంటామని పురాణ గాథ. శ్రీవారి వాహనసేవలో పాల్గొనేందుకు కూడా భక్తులు ఈ ఏడు ప్రాకారాలను దాటుకుంటూ శ్రీవారి వాహనసేవను వీక్షిస్తారు.

పరమపావనం-శ్రీవారిపుష్కరిణి స్నానం

"స్వామిపుష్కరిణీ స్నానం..సద్గురో పాదసేవనమ్,
ఏకాదశీ వ్రతం చాపిత్రయ మత్యంత దుర్లభమ్
దుర్లభం మానుషమ్ జన్మదుర్లభం తత్రజీవనమ్
స్వామిపుష్కరిణీస్నానం తత్రమత్యంత దుర్లభమ్"

శ్రీవారి పుష్కరిణీ స్నానం, సద్గురు పాదసేవనం, ఏకాదశీవ్రతం ఈమూడు అత్యంత దుర్లభములు,మానవుడిగా జన్మించడం, మానవుడిగా మనుగడ సాగించడం, మానవజీవితంలో శ్రీస్వామి పుష్కరిణిలో స్నానంచేయడం అనేవి లభ్యంకావడం చాలా దుర్లభమైనవని వరాహ పురాణంలో పేర్కొనబడింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమలలోని శ్రీవారిపుష్కరిణి బ్రహ్మాండంలోని సర్వతీర్థాలకు "స్వామి వంటిది. మహావిష్ణువు ఆనతిపై వైకుంఠంనుంచి క్రీడాద్రితో కూడా ఈపుష్కరిణిని తెచ్చిగరుత్మంతుడు ఈ క్షేత్రంలో స్థాపించినట్లు పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. స్వామిపుష్కరిణి సర్వతీర్థాలకు నిలయం. స్నానంచేసినంత మాత్రానే ఇహపరాలను రెండింటిని ప్రసాదిస్తుంది. ధనుర్మాసంలో శుక్లపక్ష ద్వాదశిరోజు అరుణోదయవేళ ఎవరైతే మనఃప్రీతితో స్నానంచేస్తారో వారు, వారి సగోత్రులైన దాయాదులు, బంధువులు, అన్ని పాపాలనుంచి విముక్తులవుతారు. ఎందరెందరో ఈ పుష్కరిణిలోస్నానంచేసి, స్వామిని ప్రార్థించి ఎన్నో వరాలు పొందారు. ■

సామాన్యభక్తులకు మూలవిరాట్టు దర్శనం

-టిటిడి ఛైర్మన్ డాక్టర్ చదలవాడ

అక్టోబర్ 3నుంచి 11వరకు జరగనున్న శ్రీవారి వార్షిక నవ రాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆదేశాలమేరకు సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాం. సామాన్యభక్తుల మధ్య తోపులాటకు తావులేకుండా ప్రశాంతంగా వాహనసేవలువీక్షించేలా, తిరుమలయాత్ర అనంతరం తీపిజ్ఞాపకాలతో తమ సొంతప్రాంతాలకు తిరిగివెళ్ళేలా అత్యంత దివ్యంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వున్నాయి.

తిరుమలలో భక్తిభావం పెంపొందించే ఉద్యానవనాలు

-టిటిడి ఇవో డాక్టర్ సాంబశివరావు

కలియుగవైకుంఠం తిరుమలలో భక్తుల్లో భక్తి భావం పెంపొందించేలా ఈ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా శ్రీవారు, శంఖుచక్రాలు, ఆనందనిలయం రంగు రంగుల ఆకులు, పుష్పాలతో ప్రహరీ కళాత్మక ఉద్యాన వనాలను తీర్చిదిద్దాం. ఆలయం ముందుభాగంలో ప్రహరీ ఉద్యాన వనాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గతంలో నిర్వహించిన శ్రీవారి బ్రహ్మోత్సవాల కంటే మెరుగ్గా ఈ ఏడాది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వీలైనంతవరకు తిరుమలకుచేరుకున్న భక్తులకు ఏరోజుకారోజు స్వామివారి మూలవిరాట్టుదర్శనంతోబాటు వాహనసేవలు వీక్షించేందుకు చక్కటి ఏర్పాట్లు చేపట్టామని టిటిడి ఇవో డాక్టర్ దొండపాటి సాంబశివరావు తెలిపారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో ప్రత్యేకంగా ప్రవేశ, నిష్క్రమణమార్గాలు ఏర్పాటుచేశాం. భక్తులకు దర్శనం, వసతి విషయంలో సంతృప్తికరంగా సేవలందిస్తాం. భక్తులకోసం 7లక్షల లడ్డూలు తయారుచేసి వుంచాము.

భక్తులకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

-జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు

తిరుమలలో అక్టోబర్ 3నుంచి జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశాము. గతఅనుభవాలను దృష్టిలో వుంచుకుని ఈ ఏడాది కూడా అశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకుఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాం. బ్రహ్మోత్సవాలలో ప్రధానంగా అక్టోబర్ 7న గరుడవాహనసేవను రాత్రి 7.30గంటలకే ప్రారంభిస్తాం. తిరుమలలో కూడా అదనపు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేశాం. ప్రశాంతంగా వాహన సేవలను వీక్షించేందుకు వీలుగా తిరుమలలో పలుప్రాంతాల్లో ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటుచేశాం.

"పరమపవిత్రం ఆదివరాహక్షేత్రం":

కలియుగప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుడు పరమపవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంలో వెలసి"కలౌ వేంకటనాయకః" అని ప్రసిద్ధి పొంది భక్తులను రక్షిస్తున్నాడు. శ్రీ వేంకటేశ్వరుడు ఈ క్షేత్రంలో వుండటానికి పూర్వమే శ్రీమన్నారాయణుడు శ్వేతవరాహారూపంతో అవతరించాడు. హిరాణ్యక్షుడిని శ్రీమహావిష్ణువు వరాహావతారంలో సంహరించిన తరువాత సాధుసంరక్షణ చేయడానికి భూలోకం లోనే వుండటానికి అంగీకరించి వేంకటాచలం మీద తన నివాసం ఏర్పరచుకున్నాడు. ఈ వరాహస్వామిని వకుళ మాలిక అనే భక్తురాలు సేవిస్తూ వుండేది. భూదేవి తనను రక్షించినందుకు వరాహస్వామిని తన భర్తగా చేసుకుంది. అందుకే ఆమెతో కలసి అక్కడే భూవరాహస్వామి స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. అప్పటినుంచి అది 'ఆదివరాహ క్షేత్రంగా' పిలువబడుతున్నది. అందువల్లే మొట్టమొదటి నైవేద్యం వరాహస్వామికి నివేదనచేస్తారు. ఈ క్షేత్రంలో మొదట వరాహ స్వామిని దర్శించిన తరువాతే శ్రీనివాసుని దర్శనం చేసుకుంటారు. శ్వేత వరాహస్వామి శ్రీవైకుంఠంనుంచి గరుడుని ఆజ్ఞాపించి క్రీడాద్రిని భూమిపైకి తెప్పించుకున్నాడు. దానికే "వేంకటాద్రి"అని ప్రసిద్ధి ఏర్పడింది. వేంకటాచలం గోమతీనదికి దక్షిణాన 60 యోజనాల దూరంలో తూర్పుసముద్రానికి పశ్చిమాన ఐదుయోజనాల దూరంలో సువర్ణముఖీనదికి ఉత్తరభాగంలో గరుడునిచే స్థాపించబడినట్లు వరాహపురాణంలో వుంది. వరాహస్వామి గరుడునితో ఇలా చెబుతాడు...'భూదేవిని జలప్రళయంనుంచి వరాహావతారంతో ఉన్న నేను రక్షించాను. అందువల్ల నన్ను భూదేవి భర్తగా చేసుకోవాలని అడుగగా నేను అందుకు అంగీకరించాను. కానీ వికృతమైన వరాహ రూపంలో ఉన్న నేను వైకుంఠానికి వెళితే లక్ష్మీదేవి నన్ను చూచి భయపడవచ్చు. ఎగతాళి చేయొచ్చు. ఈ భూలోకాన్ని జాగ్రత్తగా కాపాడవలసిన బాధ్యత నాకుంది. కావున భక్తుల కోరికపై ఇక్కడే కొంతకాలం వుంటాను' అన్నాడు.

శ్రీవారి ఆలయంలో పిల్లి..

సాధారణంగా మనము నిద్రలేవగానే....లేదా ఏదేని శుభకార్యా లకు వెళ్ళేసమయంలో పిల్లి ఎదురువస్తే అపశకునం (అశుభం) అంటుంటారు. అదే దేవదేవుడు తిరుమల శ్రీవారి ఆలయంలో అర్చకులు, జీయ్యంగార్లు, సన్నిధిగొల్లలకు పిల్లి కనిపిస్తేనే అంతా శుభం అనే పురాణచరిత్ర వుంది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం గర్భగుడిలో ఒకదైవికమైన పిల్లి అనుచానంగా నివసిస్తోంది. సాధారణంగా శ్రీవారి ఆలయం బంగారువాకిలి తలుపులు తెల్లవారు జామున 3గంటలకు సుప్రభాతసేవ సమయంలో తెరుస్తారు. ఈ సమయంలో బంగారువాకిలి లోపలకు అర్చకులు, జీయంగారుస్వామి ఏకాంగితోపాటు సన్నిధిగొల్ల యాదవుడు మాత్రమే ప్రవేశిస్తారు. ఇదే సమయంలో ఒక దైవికమైన పిల్లి క్రమంతప్పకుండా వీరికి బంగారువాకిలిలో నిదర్శనం కనిపిస్తుంది. ప్రతిరోజూ రాత్రి శ్రీవారి ఏకాంతసేవసమయంలో తలుపులుమూసివేస్తారు. ఆ సమయంలో బ్రహ్మదిదేవతలు శ్రీవారిని అర్చిస్తారని పురాణగాథలు. అందుకే ఈ సమయంలో గర్భాలయంలో ఎవరూ వుండకూడదు. ఇక్కడ స్వామి వారికి సమర్పించే నైవేద్యం అర్చకులు పెట్టినపుడే పిల్లి ఆరగిస్తుం దని, లేకుంటే ఆ ప్రసాదాల వైపువెళ్ళదని చెబుతున్నారు. రాత్రి ఏకాంత సేవసమయంలో స్వామివారికి నివేదించే పాలు అర్చకులు ఇస్తే స్వీకరిస్తుంది ఈ పిల్లి. శ్రీవారికి నివేదించని ప్రసాదాన్ని ఇది స్వీకరించదు.

టిటిడి సంక్షేమ పథకాలకు దాతల దాతృత్వం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేస్తున్న భక్తులకు దర్శనం, బస, ఉచితంగా అన్నప్రసాదం వితరణ తదితర వసతులను టిటిడి కల్పిస్తోంది. వీటితోపాటు ఉచితంగా విద్య, వైద్యం అందించి ఆపన్నులను ఆదుకుంటోంది. అదేవిధంగా వారసత్వ సంస్కృతి పరిరక్షణ, వేదపరిరక్షణ ,గోసంరక్షణ కోసం కృషిచేస్తోంది. ఈ బృహత్కార్యాలను పటిష్టంగా అమలుచేసేందుకు పలు ట్రస్టులను ఏర్పాటుచేసి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతోంది. ఆసక్తి గల దాతల నుంచి విరాళాలు సేకరించి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో 2005లో టిటిడి తిరుమలలో దాతల విభాగాన్ని ప్రారంభించింది. తిరుమలలోని ఆదిశేషు విశ్రాంతి గృహం లోని సెల్లార్ పోర్షన్‌లో దాతల విభాగం నడుస్తోంది. ప్రస్తుతం తొమ్మిది ట్రస్టులు,ఒకస్కీమ్‌కు దాతలనుంచి విరాళాలను స్వీకరిస్తోంది.

1.శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు 2.శ్రీవేంకటేశ్వర బాలమందిరం ట్రస్టు 3.శ్రీవేంకటేశ్వర వారసత్వ సంస్కృతి పరిరక్షణట్రస్టు 4.శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టు 5.శ్రీవేంకటేశ్వర వేదపరిరక్షణ ట్రస్టు 6.శ్రీవేంకటేశ్వర బర్డ్ ట్రస్టు 7.శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు 8.శ్రీవేంకటేశ్వర నిత్యాన్న ప్రసాదం ట్రస్టు 9.శ్రీనివాస శంకర నేత్రాలయ ట్రస్టు 10.శ్రీబాలాజీ ఆరోగ్యప్రసాదిని స్కీమ్. ఈ ట్రస్టు లు,స్కీమ్‌లకు విరాళాలు అందించే దాతలకు డిజిటల్ పాసుపుస్తకా లను 48గంటల్లో మంజూరుచేస్తున్నారు. వీటి ఆధారంగా దాతలకు దర్శనం, వసతి ఇతర సౌకర్యాలను టిటిడి కల్పిస్తోంది. ప్రస్తుతం ట్రస్టుల్లో అన్నప్రసాదం ట్రస్టు విరాళాలు 100కోట్ల రూపాయలకు పైనే చేరింది. శ్రీబాలాజీ ఆరోగ్యవర ప్రసాదిని స్కీమ్‌కు, ప్రాణ దాన ట్రస్టుకు దాతలు భారీగా విరాళాలివ్వాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. ఇతర ట్రస్టులన్నింటికీ సెక్షన్ 80(జి) ప్రకారం 50శాతం పన్ను మినహాయింపు వుంటుంది.

దాతలకు కల్పిస్తున్న ప్రత్యేక వసతులు...

టిటిడిలోని వివిధ ట్రస్టులకు,స్కీమ్‌లకు విరాళాలు ఇచ్చేదాతల్లో లక్షరూపాయల నుంచి 5లక్షల రూపాయలలోపు దాత కుటుంబ సభ్యులు ఐదుమందికి మించకుండా సంవత్సరానికి ఒకసారి ఒకరోజు ఉచితంగా బసకల్పిస్తారు. దాత కుటుంబసభ్యులకు సంవత్సరానికి ఒకరోజు ప్రత్యేక ప్రవేశదర్శనమార్గంద్వారా శ్రీవారి దర్శనం కల్పిస్తా రు. ఒకసారి ఆరుచిన్నలడ్డూలను ప్రసాదంగా అందజేస్తారు. దాతకు సంవత్సరానికి ఒక ఉత్తరీయం, ఒక రవికె బహుమానంగా అందజే స్తారు. కోటిరూపాయలు, ఆపైన విరాళాలిచ్చిన దాతలకు టిటిడి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది.

బ్రహ్మోత్సవాలకు మేము సిద్ధం..

-టిటిడి సివిఎస్‌వో శ్రీనివాస్

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి అపోహలు, అసత్య ప్రచారాలకు అవకాశం లేకుండా భద్రతను కట్టుదిట్టంచేశాం. భక్తుల భద్రతే ధ్యేయంగా పోలీసు, విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం సిద్ధమైంది. శ్రీవారి దర్శనానికి వెళ్ళే భక్తులకు వైకుంఠం క్యూలైన్లలో త్వరగా దర్శనం చేయించడానికి ప్రత్యేకటీమ్‌లు ఏర్పాటుచేయడం జరిగిందని టిటిడి సివిఎస్‌వో ఘట్టమనేని శ్రీనివాస్ తెలిపారు. తిరుమలలో ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు చర్యలు తీసుకున్నాం. ఆర్టీసి బస్సులు రింగురోడ్డుపై కుడివైపుకు, అన్ని ప్రైవేటువాహనాలు,భక్తుల వాహనాలు ఎడమ వైపుకు తిరిగి ఆయా నిర్దేశిత పార్కింగ్‌ప్రాంతాలకు చేరుకోవాలి.

శ్రీవారి భక్తితత్త్వాన్ని చాటిన ఆళ్వార్లు

భగవంతుని పట్ల కనబరిచే పవిత్రమైన ప్రేమభావనే భక్తి. దేవుని స్వరూప,రూప, గుణవైభవాన్ని అనుభవించడం కూడా భక్తే. ఇలాంటి భగవత్ భక్తి సాగరంలో మునకలు వేస్తూ లోతులు చూసిన శ్రీవైష్ణవ భక్తశిఖామణులు ఆళ్వారులు. శ్రీ వైష్ణవ సంప్రదాయానికి మూల పురుషులు మొత్తం 12మంది ద్రావిడ దేశంలో అవతరించి శ్రీమన్నారాయణుడి లీలావిశేషాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నాలుగు వేల పాశురాలలో కీర్తించారు. పాశురమంటే పద్యమని భావం. ఈ పాశురాలలో తిరుమల, శ్రీరంగం, కంచి తదితర వైష్ణవ దివ్యదేశాలలో వెలసిన భగవంతుని అర్చామూర్తులను పలు విధాలుగా ప్రస్తుతించారు. వేదాంతసారాలైన ఆళ్వార్ల రచనలు నాలాయిర దివ్యప్రబంధమనే పేరుతో ప్రఖ్యాతిగాంచాయి. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిపై 10మంది ఆళ్వార్లు పాశురాలు రచించి కీర్తించారు. వీరిలో 1.పాయ్‌కై ఆళ్వారు 2.పూదత్తాళ్వార్ 3.పేయాళ్వార్ 4,తిరుమళిశై ఆళ్వార్ 5.కులశేఖరాళ్వార్ 6.నమ్మాళ్వార్ 7.పురియాళ్వార్, 8.ఆండాల్ (గోదాదేవి) 9.తిరుప్పాణ్ ఆళ్వార్ 10.తిరుమంగై ఆళ్వార్. కాగా మధురకవి ఆళ్వార్, తొండరడిప్పొడి ఆళ్వార్ శ్రీవారిపై పాశురాలు రచించలేదు. ఈ ఆళ్వార్లలో ఏ ఒక్కరూ తిరుమల కొండపై అడుగుపెట్టలేదు. శ్రీవారు వెలసిన కొండ ఆదిశేషుని రూపమని, పాదం మోపరాదని వారి భావన. తిరుమలకొండకు నమస్కరిస్తే స్వామివారికి నమస్కరించి నట్లేనని, పాపాలన్నీ తొలగిపోతాయని పాశురాల్లో వివరించారు. ఆళ్వార్లు తమ దివ్యశక్తితో తిరుపతినుంచే స్వామివారిని దర్శించారు.

పాయ్‌కై ఆళ్వారు(సరోయోగి):

పాయ్‌కై ఆళ్వార్ కాంచీనగరంలోని తిరువెక్కా అనే క్షేత్రంలో ఒక సరస్సులో బంగారు తామరపూలో జన్మించారు. శ్రీమన్నారాయణుని ఆయుధాలలో ఒకటైన పాంచజన్యం (శంఖు) అంశతో ఆశ్వయుజమాసం శ్రవణానక్షత్రంలో జన్మించారు. 100పాశురాలు గల ముదల్ తిరువందాదా అనే ప్రబంధాన్ని రచించారు.

పూదత్తాళ్వార్ (భూతయోగి):

పూదత్తాళ్వార్ తిరుక్కడల్ మల్లై (మహాబలిపురం) అనే క్షేత్రంలో సముద్రతీరంలో ఒకనల్లకలువ పూవునుంచి ఆశ్వయుజమాసంలో ధనిష్ఠానక్షత్రం లో జన్మించాడు. స్వామివారి కౌమోదకి అనే గద అంశంగా అవతరించారు. 100పాశురాలుగల ఇరణ్డామ్ తిరువందాది అనేగ్రంధాన్ని రచించారు.

పేయాళ్వార్(మహాయోగి):

పేయాళ్వార్ ఇప్పటి మద్రాస్(చెన్నై)నగరంలోని మైలాపూర్ ప్రాంతంలో గత ఒకబావిలో ఎర్ర తామర పువ్వులో ఆశ్వయుజమాసం శతభిష నక్షత్రంలో జన్మించారు. శ్రీవారి భగవంతుని ఖడ్గమైన నందకమనే అంశతో అవతరించాడు. 100 పాశురాలుగల మూన్రామ్ తిరునందాది అనే ప్రబంధాన్ని రచించారు.

తిరుమళిశై ఆళ్వార్ (భక్తిసారయోగి):

తిరుమళిశై ఆళ్వార్ చెన్నై నగరానికి సమీపంలో గత తిరుమళిశై అనే క్షేత్రంలో భార్గవమహర్షికి కుమారుడుగా అవతరించాడు. భగవానుని చక్రాయుధం అంశతో వీరు పుష్యమాసం మాఘనక్షత్రంలో

మహా అన్నప్రసాదాలు-కమ్మని ఆరగింపులు

తిరుమలరాయుడు అలంకారప్రియుడేగాక మిక్కిలి భోజన ప్రియుడు. భక్తులకోసం తాను ఎన్నో, ఎన్నెన్నో కమ్మగావున్న దివ్యాన్నాలను, పిండివంటల్ని పుష్టిగా ఆరగిస్తారు. ఉదయం సుప్రభాత సేవలో పాలు, వెన్న మొదలుకుని వరుసగా పొంగళ్ళు, పులిహోర, చక్కెరపొంగలి, దధ్యోన్నం, క్షీరాన్నం, పాయసం, కదంబం, ముళహోర, కట్టెపొంగలి, సిరా, కేసరి, లడ్డులు, వడలు, అప్పాలు, దోసెలు, జిలేబీలు, తేనెతొళలు, పోలీలు, సుఖియలు, గుగ్గిళ్ళు ఇలా ఎన్నింటినో తృప్తిగా ఆరగిస్తున్న స్వామి ఆనంద నిలయుడు. తన చూపులతో ఆ పదార్థాలన్నింటినీ పవిత్రంచేసి, ఆస్వాదించి, తన భక్తులకు ప్రసాదంగా ప్రసాదిస్తున్నాడు.

మొదటి నైవేద్యం దధ్యోన్నం (పెరుగుఅన్నం), రెండో నైవేద్యం "శుద్ధాన్నం":

దేవదేవుడు శ్రీనివాసుడి కొలువులో తోమాల, సహస్రనామార్చన తరువాత మొదట నైవేద్యంగా స్వామివారికి దధ్యోన్నం నివేదన జరుగుతుంది. అలాగే అష్టోత్తర శతనామార్చన తరువాత రెండో నైవేద్యం వుంటుంది. ప్రతి నైవేద్యానికి ముందు శుద్ధి తప్పనిసరి. బంగారువాకిలి నుంచి కులశేఖరపడి వరకు శుద్ధిచేస్తారు. ఈ రెండవ అర్చన మంగళవారం తప్ప మిగిలిన రోజుల్లో ఏకాంతంగానే నిర్వహిస్తారు. మంగళవారం అష్టదళ పాద పద్మారాధన పేరుతో 108 బంగారు తామరపూలతో అర్చన చేస్తారు. అర్చన తరువాత అన్ని రకాల ప్రసాదాలను కులశేఖరపడి ఇవతల పెట్టినా, కులశేఖరపడి దాటి లోపలకు తీసుకెళ్ళేది మాత్రం శుద్ధ అన్నం మాత్రమే. గురువారం తిరుప్పావడనే రెండవ నైవేద్యం సమయంలో నిర్వహిస్తారు.

మూడోనైవేద్యం "చక్కెరపొంగలి"

కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఉదయం, మధ్యాహ్నం అర్చన తరువాత నైవేద్యం చేసినట్లే... రాత్రి కూడా అష్టోత్తర శతనామార్చన తరువాత నైవేద్యం వుంటుంది. ఉదయంపూట తరహాలోనే రాత్రి కూడా తోమాల తరువాత అర్చన వుంటుంది. ఉదయం అలంకరించిన పుష్పాలను ఏకాంతంలో తీసివేసి ...కొత్తమాలలు అలంకరింపజేస్తారు. ఇదంతా జీయర్ల పర్యవేక్షణలో జరుగుతుంది. రాత్రి తోమాల, అర్చన తరువాత "తిరువీసం"గా చక్కెర పొంగలి నైవేద్యంగా పెడతారు. ధనుర్మాసంలో మాత్రం చక్కెర పొంగలికి బదులు మైసూరు రాజులు ప్రవేశపెట్టిన కదంబాన్ని నైవేద్యంగా పెడతారు.

గాడిపొయ్యి ఓడుప్రసాదం:

శ్రీవారికి సంప్రదాయబద్ధంగా కట్టెలమీద ఉడికించిన అన్నప్రసాదాన్నే నైవేద్యంగా సమర్పిస్తారు. తోమాల,అర్చన సేవలు ముగిశాక తొలుత పుష్కరిణి గట్టుపైవెలసిన వరాహస్వామికి నైవేద్యం సమర్పిస్తారు.తరువాత గర్భాలయంలోని మూలమూర్తికి "ఓడు" అనే పగిలిన కొత్త మట్టికుండలో వెన్న మీగడలతో కూడిన మాతృత్వద్యోజనంను నైవేద్యంగా సమర్పిస్తారు. తన కుమారుడికి రుచిగా వండుతున్నారా లేదా అని వంటశాలకు ఎదురుగా ఉన్న వకుళాదేవి చూపులు ప్రసరించటంవల్ల ఈ ప్రసాదాలకు అంత రుచి వస్తుందని చెబుతారు.

జన్మించారు. 96 పాశురాలు గల నామ్మకన్ తిరువందాది అనే ప్రబంధాన్ని 120పాశురాలుగల తిరుచ్చంద విరుత్తమ్ అనే ప్రబంధాన్ని రచించాడు.

కులశేఖరాళ్వార్ (కులశేఖరసూరి):
కులశేఖరాళ్వార్లు క్షత్రియ కులంలో జన్మించారు. కేరళ రాష్ట్రంలోని కొల్లినగర్ అనే నగరంలో మాఘమాసంలో పునర్వసు నక్షత్రంలో భగవంతుని వక్షస్థలాన్ని అలంకరించే కౌస్తుభమనే రత్నంయొక్క అంశతో జన్మించారు. శ్రీరామచంద్రుని పట్ల గొప్ప భక్తికలవారు కావున కులశేఖరప్పెరుమాళ్ అనే పేరుతో ప్రసిద్ధులు. పెరుమాళ్ తిరుమొళి అనే దివ్యప్రబందాన్ని ముకుందమాల అనే సంస్కృత స్తోత్రాన్ని రచించారు.

నమ్మళ్వార్ (శఠకోపసూరి):
ఆళ్వార్లందరిలో నమ్మళ్వార్ ప్రధానమైనవారు. తమిళనాడులోని ఆల్వార్ తిరునగరి అనే క్షేత్రంలో వైశాఖనక్షత్రంలో విశ్వక్సేనుల అంశతో జన్మించారు. తిరువిరుత్తం, తిరువాశిరియమ్, పెరియ తిరువందాది, తిరువాయ్‌మొళి అనే నాలుగు ప్రబంధాలను రచించారు. ఈ ప్రబంధాలు రుగ్వేదం,యజుర్వేదం, అధర్వణవేదం, సామవేదాల సారంగా ప్రసిద్దిపొందాయి.

పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు):
తమిళనాడులోని విల్లిపుత్తూరుక్షేత్రంలో శ్రీమన్నారయణుని వాహనమైన గరుడుని అంశతో జ్యేష్టమాసం స్వాతినక్షత్రంలో జన్మించారు. పాండ్యరాజసభలో వాదించి విష్ణువే పరతత్త్వమనే సిద్ధాంతాన్ని నిరూపించారు. మంగళాశాసన ప్రబంధమైన తిరుప్పలాండ్లు, పెరియాళ్వార్ తిరుమొళి అనే ప్రబంధాలను రచించారు. ఇందులో శ్రీకృష్ణుని బాల్యలీలలను విశేషంగా వర్ణించారు.

ఆండాళ్ (గోదాదేవి):
గోదాదేవి భూదేవి అంశతో ఆషాఢమాసంలో పూర్వ ఫల్గుణి నక్షత్రంలో పాండ్యదేశంలోని (తమిళనాడు) శ్రీవిల్లిపుత్తూరులో తులసివనంలో జన్మించారు. ఈమెను పెరియాళ్వార్లు కుమార్తెగా అభిమానించి పెంచారు. శ్రీకృష్ణుని భర్తగా పొందడంకోసం మార్గశీర్ష వ్రతాన్ని ఆచరించి ఆవ్రత క్రమాన్ని తిరుప్పావై ప్రబంధంగా లోకానికి అందించారు.143పాశురాలు గల నాచ్చియార్ తిరుమొళి ప్రబంధాన్ని రచించారు.

తిరుప్పాణ్ ఆళ్వార్ (ప్రాణయోగి):
తిరుప్పాణ్ ఆళ్వార్లు కార్తీకమాసంలోని రోహిణీ నక్షత్రంలో నిచుళాపురి (ఉఱైయార్)అనే గ్రామంలో శ్రీవత్సమనే శ్రీమన్నారయణుని పుట్టు మచ్చ అంశతో జన్మించారు. ఈయనకు మునివాహన సూరి అనికూడా పేరు. అమలనాదిపిరాన్ అనే 10పాశురాలు కల ప్రబంధాన్ని రచించి శ్రీరంగనాధుని దివ్యరూపాన్ని కీర్తించారు.

తిరుమంగై ఆళ్వారు:
తిరుమంగై ఆళ్వారు కార్తీకమాసంలోని కృత్తికానక్షత్రంలో తిరువాలి తిరునగరి అనే క్షేత్రంలో శ్రీమన్నారాయణుని శార్‌ఙ్గమనే ధనస్సు అంశతో జన్మించారు. ఈయన పెరియ తిరుమొళి, తిరుక్కురుణ్డాకమ్, తిరువెళుకూత్తి రుక్కై, తిరునెడువాణ్ణుణధకమ్ అనే దివ్యప్రబంధాలను పాడారు. ఇది ద్రవిడ వేదాంగాలుగా ప్రసిద్ధిచెందాయి.

పెరియాళ్వార్

మధురకవి ఆళ్వార్:
మధురకవి ఆళ్వార్లు నమ్మాళ్వార్లుకు సమకాలికులు. శిష్యులు. వీరుచైత్రమాసంలో చిత్తానక్షత్రంలో నిత్యసూరు లో ఒకరైన గణాధిపుని అంశతో అవతరించారు. నమ్మాళ్వార్లనే దైవంగా కొలిచారు.నమ్మాళ్వార్లను కీర్తిస్తూ వీరు రచించిన 11పాశురాలు కల కణ్ణినుణ్ శిరుత్తామ్బు అనే ప్రబంధం ఆచార్యుడే పరదైవమనే నిష్టను తెలుపుతోంది.

తొణ్ణరడిప్పొడి ఆళ్వార్ (భక్తాంఘ్రిరేణువు):
తొణ్ణరిడిప్పొడి ఆళ్వార్ మార్గశిర మాసంలో జ్యేష్టానక్షత్రంలో చోళ దేశంలోని "మండంగుడి" అనే క్షేత్రంలో శ్రీమహావిష్ణువు ధరించే వనమాల అనే పూమాలిక అంశతో జన్మించారు. వీరికి విప్రనారాయణులని కూడాపేరు. శ్రీరంగనాధుని తప్ప వేరొకరిని కీర్తించని ప్రత్యేకత వీరిది. 11పాశురాలు గల తిరుప్పళ్ళి ఎళుచ్చి ప్రబంధాన్ని, 45పాశురాలు గల తిరుమాలై ప్రబంధాన్ని వీరు రచించారు.

తిరుమలలో ముక్తిప్రద తీర్థాలు

తుంబురతీర్థం: ఇది శ్రీవారి సన్నిధికి ఏడున్నరమైళ్ల దూరంలో వెలసిన తీర్థం. తుంబురుడు ఒకసారి మానవమాత్రుడైన ఒక చక్రవర్తిని స్తుతించి, అపూర్వమైన వీణను బహుమతిగా పొందా డట. దీనితో కోపించిన నారదుడు అతన్ని శపించాడు. ఆ శాప కారణంగా తుంబురుడు వేంకటాద్రిమీది, ఘోణతీర్థతీరంలో పతితుడ య్యాడు. "వేంకటేశో మాం రక్షతుః"అంటూ సంవత్సరకాలం పాటు తపస్సుచేసి వేంకటేశ్వరుని సాక్షాత్కరింపజేసుకుని, తీర్థాన్ని తనపేరుతో పిలిచేలా వరంకోరుకున్నాడు.

రామకృష్ణతీర్థం: పూర్వం రామకృష్ణ మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేస్తున్నపుడు తపశ్శక్తితో తన స్నానార్థమై కల్పించుకున్నతీర్థం రామకృష్ణ తీర్థం. తిరుమల ఆనందనిలయానికి ఆరుమైళ్ళ దూరంలో ప్రవహిస్తున్న తీర్థం ఇది. రామకృష్ణమహర్షి ఈ తీర్థజలాలతో స్నాన పానాదులు, ఆచమన అర్చనాదులు నిర్వహిస్తూ చాలాకాలం తపస్సు చేశాడు. ఇందులో స్నానం చేసినవారు తల్లి దండ్రులకు, గురువులకు చేసిన అపకారపాపాలు ప్రక్షాళనం అయిపోతాయని ప్రసిద్ది.

పసుపుధార,కుమారధారతీర్థం: ఒకప్పుడు పర్వతశిలల నుంచి జాలు వారిన శిలాజిత్తుతోనో,మూలికల మహత్తుతోనో పసుపుపచ్చని స్వచ్ఛ మైన జలాలు పారుతుండటం వల్ల దీనికి పసుపుధారతీర్థమని పేరువచ్చింది.

కాయరసాయన తీర్థం: తెల్లని ఆకును ఈ తీర్థంలోవేస్తే కొన్ని క్షణాల లోనే నీలిరంగును సంతరించుకుంటుందని ప్రతీతి. మానవులకు మానసిక శక్తిని, శారీరక ఆరోగ్యాన్ని ప్రసాదించే తీర్థమిది. ఈ తీర్థంలో స్నానమాచరించినవారికి, యోగులు దర్శనమిస్తారని విశ్వాసం. శ్రీవారి ఆలయానికి మూడున్నర కి.మీ.దూరంలో వుంది.

ఆకాశగంగతీర్థం: తిరుమల ఆలయానికి రెండుమైళ్లదూరంలో ఈ తీర్థం వుంది. ఇక్కడి జలాలు దేవతలకే నోరూరిస్తాయి. భక్తిభావ సంకీర్తనలు మానవులకు శ్రోత్ర యజ్ఞఫలాన్ని అందిస్తుంది. కేసరి భార్య అంజన ఈ తీర్థంలో స్నానంచేసి తపస్సుచేసి వాయుదేవుడు ప్రసాదించిన ఫలాన్ని భక్షించి లోకైకవీరుడు ఆంజనేయుడికి జన్మనిచ్చిందని స్కందపురాణం చెబుతుంది. స్వామివారి అభిషేకానికి ఈ అకాశగంగాజలాన్ని ప్రతినిత్యం తీసుకుని వస్తారు.

పాపవినాశనతీర్థం: పేరుకు తగిన మహిమగల తీర్థం. శ్రీవారి ఆల యానికి రెండున్నరమైళ్లదూరంలో అలరారుతున్న తీర్థం. అటు ఆకా శానికి ఇటు కలియుగవైకుంఠానికి వంతెనగా చేసుకోవడానికి దించిన పాలపుంతలా కనిపిస్తుంది ఈ ఆనకట్ట. బ్రహ్మరాక్షసులు ఆవహించిన వారు ఈ పాపవినాశనతీర్థంలో మూడురోజులు నియమపూర్వకంగా స్నానమాచరిస్తే బ్రహ్మరాక్షోబాధలు తొలగి స్వస్థచిత్తలవుతారని స్కందపురాణంలో చెప్పబడింది.

గోగర్భతీర్థం(పాండవతీర్థం): శ్రీవారి సన్నిధికి రెండు కి.మీ. దూరంలో గోగర్భతీర్థం వుంది. ఇక్కడే పాండవ గుహలు వున్నాయి. పాండవులు ఈ తీర్థంలో స్నానం చేసి పుణ్యయోగం సంపాదించుకున్నారు.

శేషతీర్థం: జ్ఞానప్రదతీర్థాలలో శేషతీర్థం ముఖ్యమైనది. ఆదిశేషుడికి సంబంధించిన తీర్థం. ఈ శేషతీర్థానికి వెళ్ళే రాతిబాటనుంచిచూస్తే వృషభాద్రి, నీలాద్రి, అంజనాద్రి, శేషాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి అనబడే ఈ సప్తఅద్రుల దివ్యసౌందర్యం అంతా కరిగి పచ్చలసముద్రంలా ప్రవహిస్తున్నట్లుంటుంది పర్వతశ్రేణి.

అహంకార ఫలితం! కథ

అడవిలో ఒక ఎలుక హాయిగా జీవిస్తోంది. ఆ ఎలుక నివసిస్తున్న బొరియ ముందు ఉన్న చెట్టుకింద ఒక యోగి తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఆయన ఎంతో మహిమాన్వితుడు. ఒకరోజు ఒక పిల్లి, ఎలుకను వేటాడ వచ్చింది. ఎలుక బొరియలో దూరి తప్పించుకుంది. కానీ ఆ పిల్లి అలా రోజూ ఎలుకను పట్టే ప్రయత్నం చేయడంతో ఓరోజు ఎలుక ఆ యోగివద్దకు వెళ్లి 'స్వామీ! ఒక పిల్లి నన్ను చంపాలని చూస్తోంది. నన్ను నేను రక్షించుకోలేకపోతున్నాను. మీరు దయతలచి నన్ను పిల్లిగా మార్చండి' అని ప్రాధేయపడింది.

యోగి తన కమండలంలోని మంత్రజలాన్ని ఎలుకపై చల్లాడు. దాంతో ఎలుక, పిల్లిలా మారి, 'హమ్మయ్య, ప్రాణభయంతప్పింది' అనుకుంది. కొంతకాలానికి పిల్లిరూపంలోని ఎలుకను ఓ కుక్క వేటాడింది. దాంతో అది మళ్లీ యోగివద్దకు వెళ్లి విషయం చెప్పి తనను కుక్కను చేయమని వేడుకుంది.

యోగి, పిల్లిగా ఉన్న ఎలుకను, కుక్కగా మార్చాడు. కొన్నిరోజులు హాయిగానే గడిచాయి. అయితే ఓరోజు ఎక్కడినుండో ఒక సింహం వచ్చి కుక్క రూపంలోని ఎలుకను తరిమింది. దాంతో కుక్క మళ్లీ యోగిని ఆశ్రయించి, తనను సింహంగా మార్చమని కోరింది. యోగి దాని కోరిక తీర్చాడు.

అయితే సింహంగా మారిన ఎలుక అహంకారంతో విర్రవీగి కనిపించిన జంతువులన్నీ వేటాడుతూ వేధించసాగింది. అడవిలోని జంతువులన్నీ హడలిపోసాగాయి. ఒకరోజు ఆయుర్వేద వైద్యులు వనమూలికలకోసం అడవికి వచ్చారు. సింహం (ఎలుక) వారిపై కూడా దాడిచేసింది. అయితే వారితోపాటు ఉన్న రక్షకభటులు నేర్పుగా వారిని రక్షించారు. అంతేకాదు విషయాన్ని అటవీశాఖకు తెలిపారు. అటవీశాఖవారు వలపన్ని సింహాన్ని బంధించి జంతు ప్రదర్శనశాలకు తరలించారు. అక్కడ ఇరవై అడుగుల లోతైన గొయ్యి తీసి, మధ్యలో చిన్న దిబ్బపై సింహాన్ని ఉంచారు. గొయ్యిని నీటితో నింపారు. గోతిచుట్టూ పది అడుగుల గోడ కూడా నిర్మించారు. దిబ్బకు ఓవైపు చిన్న గది ఏర్పాటుచేశారు. సింహం ఆ గదిలోకి మాత్రం వెళ్లగలదు. జంతు ప్రదర్శనశాల అధికారులు వేసిన ఆహారాన్ని మాత్రమే అది తినాలి. స్వేచ్ఛ అసలే లేదు. దాంతో జంతు ప్రదర్శనశాలకు వచ్చిన చిన్న పిల్లలుసైతం సింహాన్ని వెక్కిరిస్తూ, భయపెట్టసాగారు. అప్పుడది చింతిస్తూ 'అడవిలో హాయిగా స్వేచ్ఛగా ఉండే నేను అహంకారంతో విర్రవీగి కష్టాలు కొనితెచ్చుకున్నాను' అని విచారించింది.

అందరినీ భయపెట్టే సింహం ఎటూ కదల్లేక బందీగా బతుకుతూ అహంకార ఫలితాన్ని అనుభవిస్తూ, పశ్చాత్తాపంతో అక్కడే శేషజీవితాన్ని గడిపింది.

–షేక్ అబ్దుల్ హాకీం జాని, తెనాలి.

చుక్కలు కలపండి

రంగులు వేయండి



పిల్లలూ! కింద సూచించినట్లు ఆయా అంకెలున్న చోట ఆ రంగులను వేయండి.

1-నీలం 2-కాషాయం 3-పసుపు 4-ఆకుపచ్చ 5-ఎరుపు

వార్త ఆదివారం

భరతమాత పుత్రులం

బాలగేయం

భరతమాత పుత్రులం
భావి జాతి నేతలం
నేడు మేము బాలలం
రేపు దేశ రక్షకులం

చదువుల బాగా చదివి
సైన్యములో చేరుతాం
భారత సరిహద్దులను
పోరాడి కాపాడుతాం

అమ్మా, నాన్నలను మేము
ఆదరించి తీరుతాం
ప్రత్యక్ష దైవాలంటూ
పాదాలకు మొక్కుతాం

బాధ్యత గల పౌరులుగా
దేశ ప్రజల రక్షిస్తాం
భారతాంబ సేవలోనే
బతుకంతా గడుపుతాం!

–ఐతా చంద్రయ్య, సిద్ధిపేట.

మీకు తెలుసా?

* బొద్దింకలు ఆహారం లేకుండా దీర్ఘం కాలం జీవించగలవు. అవి నెలకోసారి తిన్నా సరిపోతుందట.
* బొద్దింక తన జీవితంలో మూడువంతుల కాలం విశ్రాంతిలోనే గడిపేస్తుంది.

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

డి.భరత్ కుమార్, గుంటూరు.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. వర్షపాతాన్ని రెయిన్ గేజ్‌తో కొలుస్తారని చదివాను. అయితే ఆ పరికరంతో వర్షపాతాన్ని ఎలా కొలుస్తారో దయచేసి వివరించండి.

జవాబు: భరత్‌కుమార్! రెయిన్ గేజ్‌ను తెలుగులో వర్షమాపకం అంటారు. ఈ వర్షమాపకాన్ని లోహంతో/ ఫైబర్ గ్లాస్ తయారుచేస్తారు. ఇది 8సెం.మీ., 10 సెం.మీ. వ్యాసంతో చూడటానికి ఒక గరాటు మాదిరి ఉంటుంది. ఈ గరాటును ఒక లీటరు సామర్థ్యం గల సీసాకు బిగిస్తారు. ఈ గరాటు ద్వారా సీసాలో పడిన వర్షపు నీటి ఘనపరిమాణం కొలవడానికి ఒక కొలజాడి ఉంటుంది. బహిరంగ ప్రదేశంలో సమతలంగా ఉన్న నేలమీద 30సెం.మీ. ఎత్తున అమరుస్తారు. ఆ సీసాలో సేకరించిన నీటి ఘనపరిమాణం కొలజాడీతో లెక్కిస్తారు. ఇందులో ఒక మి.మీ.కంటే తక్కువ వర్షపాతాన్ని కూడా లెక్కించవచ్చు. వర్షపు నీరు వర్షమాపకంలోని గరాటు ద్వారా సీసాలో పడి సీసాలో కొంత ఎత్తులో నిలుస్తుంది. సీసాలో సేకరించిన నీటి ఘనపరిమాణాన్ని కొలజాడితో కొలిచి, ఆ ప్రదేశంలోని వర్షపాతాన్ని లెక్కిస్తారు. ఒకవేళ రోజుల తరబడి వర్షం కురుస్తున్న సందర్భంలో ఆటోమాటిక్ వర్షమాపక పరికరాన్ని ఉపయోగించి కొలుస్తారు. సేకరించిన నీటిని, బరువును కొలుస్తారు. ఎంత బరువు కలిగిన నీరు ఎంత వర్షపాతాన్ని సూచిస్తుందో తెలిపే ఛార్ట్‌లను ముందే రూపొందించి ఏకకాలంలో ఎంత స్థాయి వర్షం కురిసిందో మి.మీ.లలో తెలుసుకోవచ్చు. ఎక్కడైనా సంవత్సరం మొత్తంలో వర్షపాతం 254 మి.మీ. కంటే తక్కువ ఉంటే ఆప్రాంతాన్ని ఎడారిగా వ్యవహరిస్తారు. ఏప్రాంతమైనా జలవనరులతో కళకళలాడాలంటే 508మి.మీ.కు మించిన వర్షపాతం ఉండాలి.

ఎన్.నరేష్, వరంగల్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్కారాలు. నేను ఏడో తరగతి చదువుతున్నాను. వ్యాయామానికి, యోగాసనాలకు తేడా ఏమిటి? దయచేసి చెప్పండి.

జవాబు: నరేష్! ఈ రెండెంటికీ ఎంతో తేడా ఉంది. వ్యాయామం శారీరక శక్తిని వినియోగించుకుంటే, యోగాసనాలు శారీరక, మానసిక శక్తులను సంరక్షిస్తాయి. వ్యాయామం చేయడం వల్ల మనిషిలోని శక్తి వినియోగమై కండలు అవసరంలేని చోట కరగి, అవసరమైన చోట పెరుగుతాయి. యోగాసనాల వల్ల శరీరం ఆరోగ్యానికి అనువుగా రూపొంది అతితక్కువ శారీరక శక్తి వినియోగంతో ఆరోగ్య సంరక్షణ ఏర్పడుతుంది. వీటిలో ఏది చేసినా నియమాలు పాటించటం ముఖ్యం.

శ్రీహరివాసంలో శ్రీవారి సేవకులు

"వేదోఖిలో ధర్మ మూలం"

అని వేద సందేశం. ధర్మానికంతటికీ వేదమే మూలం. వేదాల్లో రాజధర్మాలు, గృహస్థ ధర్మాలు, పాతివ్రత్య ధర్మాలు, వృత్తి ధర్మాలు, సేవాధర్మం ఇలా ఎన్నో ఉన్నాయి. ధర్మాలన్నింటిలోకి సేవా ధర్మం ప్రాచీనకాలం నుండి ప్రముఖస్థానం పొందు తున్నదని మహర్షులవాక్కు. సృష్టి అంతా సేవలోనే నిబిడీకృతమై ఉంది. చెట్టు, చేమ, గుట్ట, పుట్ట, నదులు, గోవు...అన్నీ ఎంతో సేవచేస్తున్నాయి. పశుపక్ష్యాదులు గూడ తమకు చేతనైన సేవచేస్తూనే మానవాళిని తృప్తిపరుస్తున్నాయి. 'సేవ' చేస్తున్నామంటే ఇతరులను ఉద్ధరించటానికి కాదు, మనకు మనం ఉద్ధరించుకోవటమే' అంటుంది భగవ ద్గీత. 'మానవసేవే మాధవ సేవ' ఎదుటి మనిషిలో భగవంతుణ్ని దర్శిస్తూ ప్రతిపనినీ భగవత్ప్రీతికోసం చేస్తే అది 'ఆధ్యాత్మిక సేవ' అవుతుంది. అదే శ్రీవారి సేవ.

ప్రాచీనయుగాల్లో సేవా భావం:

త్రేతాయుగ ద్వాపర యుగాల్లో నిస్వార్థ సేవచేసి తరించిన మహాత్ములు, మహర్షులు, రాజులు ఎందరో ఉన్నారు. వారంతా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఎంతో సేవచేశారు. వారంతా నిర్వహించిన సేవను లోకోపకారవ్రతంగా భావించారు. త్రేతాయుగంలోని రామాయణ కాలంలో నిస్వార్థ సేవచేసిన వారిలో హనుమంతుణ్ని ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి. సీతాన్వేషణ సమయంలో, లక్ష్మణుణ్ని మూర్ఛనుండి తేరుకునేట్లు చేయటానికి ఓషధులు తెప్పించటం, రామ రావణ యుద్ధంలో కోట్ల సంఖ్యలో వానరుల సేవ, చిన్న జంతువు ఉడుత సేవ, సముద్రుడు తన వేగాన్ని తగ్గించి సేవ చేయటం, మతంగి మహర్షి ఆశ్రమంలో శబరిసేవ, రామ లక్ష్మణులు అరణ్యంలో మరణించిన జటాయువుకు అంతిమ సంస్కారములు నిర్వహించి అనాథ సేవ చేశారు.

ద్వాపరయుగంలోని మహాభారత కాలంలో పంచపాండవులు ఎనలేని సేవచేసి సేవాధర్మాన్ని నిలబెట్టుకున్నారు. పాండవులు బ్రాహ్మణ వేషధారులై 'ఏకచక్రపురం'లో ఒక బ్రాహ్మణుడి గృహంలో నివసిస్తుండగా, ఆ ఇంటి బాలుడిని ఒకరోజు బకాసురుడికి ఆహారంగా బలి ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయం తెలిసిన కుంతీదేవి బాధపడి, ఆ బాలుడికి బదులు తన కుమారుడు భీముణ్ని బకాసురుడికి ఆహారంగా నిర్ణయించింది. భీముడు తల్లి ఆజ్ఞతో ప్రయాణమై వెళ్లి బకాసురుడితో భీకరయుద్ధం చేసి ఆ రాక్షసుణ్ని సంహరించాడు. బ్రాహ్మణబాలుడిని ఏకచక్రపుర ప్రజలను బకాసురుడి బాధనుంచి రక్షించారు పాండవులు. బ్రాహ్మణ బాలుడిని రక్షించి ఆ కుటుంబానికి పుత్రభిక్ష పెట్టాడు భీముడు. చిరస్మరణీయమైన సేవ చేశారు పాండవులు. మరొక సంఘటనలో పాండవులు చేసిన సేవ అనిర్వచనీయమైనది. పాండవులు, ద్రౌపది అజ్ఞాతవాస సమయంలో విరాటరాజు కొలువులో పేర్లు మార్చుకొని, విధులు, బాధ్యతలు నిర్ణయించుకొని ప్రవేశించారు. ఒకరికొకరు తెలియని వారివలె రాజు అంతఃపురంలో రాజ కుటుంబానికి ఒక సంవత్సరకాలం నిస్వార్థ సేవ చేసి తరించారు. ధర్మాచరణ నిర్వహిస్తూ నిస్వార్థసేవ చేసినందువలనే పాండవులు, ఆ రోజునుంచీ విజయాన్ని వరిస్తూ వచ్చారు.

ఆధునిక యుగంలో సేవ...

ఆనాటి నుండి నేటివరకు భారతీయులు సేవాధర్మాన్ని నిరంతరం నిర్వహిస్తూనే ఉండటం ముదావహం. భారతదేశానికి స్వాతంత్ర్యానికి పూర్వం తరువాత నిస్వార్థ సేవలో పునీతులైన వారిలో ప్రముఖులుగా మహాత్మాగాంధీ, కస్తూరిబా గాంధీ, వినోబా భావే, వివేకానందుడు, జయప్రకాష్ నారాయణ, వావిలాల గోపాలకృష్ణయ్య, కందుకూరి వీరేశలింగం, కాశీనాధుని నాగేశ్వర రావు పంతులు మొదలైనవారున్నారు. విదేశీ మహిళలు భారతదేశానికి వచ్చి స్థిరపడి, నిస్వార్థ సేవచేసిన వారు సిస్టర్ నివేదిత, అనిబిసెంట్, మదర్ థెరిసా.. భారతీయుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారు. దరిద్ర నారాయణులకు సేవ చేయమన్న వివేకానందుని సందేశం విని విదేశీయులు భారతదేశానికి వచ్చి సేవచేశారు. నిస్వార్థసేవ జీవితానికి పరమార్థం అవుతుంది. ఇస్కాన్ వారి 'అక్షయ ఫౌండేషన్' వారు, స్వచ్ఛంద సంస్థలు, వృద్ధాశ్రమాలు, బాలమందిరం వారు వృద్ధులకు, అనాథ బాలబాలికలకు సేవచేస్తున్నారు. వృద్ధులకు ఆసరా ఇవ్వటం, అనాథలను ఆదుకోవటం, వికలాంగులకు చేయూత నివ్వటం, ఆకలిగొన్నవారికి అన్నంపెట్టటం వంటి అనేక సేవలు ఉన్నాయి. పూర్వ వేదాధ్యయనం, ఇతర ఉన్నత చదువులు చదివే బీద విద్యార్థులకు అన్నదానం, విద్యాదానం, పుస్తక దానం, వసతి ఇచ్చి వారి అభివృద్ధికి సేవచేసిన వారెందరో ఉన్నారు.

లోకోపకారవ్రతం..

సేవా ధర్మాన్ని లోకోపకార వ్రతంగా భావించాలి. పురాణకాలంలో, ప్రాచీన కాలంలో లోకోపకారవ్రతాన్ని మహర్షులు తపస్సు, యజ్ఞాలు, యాగాలు, హోమాలు, జపాలు లోకకల్యాణమే లక్ష్యంగా నిర్వహించారు. లోకోపకార వ్రతం ఆచరించినవారికి దైవబలం ఎల్లప్పుడూ ఉంటుంది. నారద మహర్షి, వాల్మీకి, వేదవ్యాసుడు, వశిష్ఠ మహర్షి, గౌతమ మహర్షి, భరద్వాజ మహర్షి మొదలైనవారెందరో మనకు మార్గదర్శకులు. నేటికీ భారతదేశంలో ఈ శుభకార్యాలు నిర్వహిస్తూనేఉన్నారు.

తల్లిదండ్రులకు సేవ..

భగవత్సేవకు ముందు ప్రతివ్యక్తి తల్లి దండ్రులకు సేవచెయ్యాలి. తల్లి దండ్రులు ప్రత్యక్ష దైవాలు. వీరు అమృత హృదయులు. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేయకూడదు, నిందించకూడదు. తల్లి దండ్రులు పిల్లలకు బాల్యంలో ఎంతో సేవచేస్తారు. అటువంటి వారికి వృద్ధాప్యంలో సేవచేయాలి. తన నిండు నూరేళ్ల జీవితం సేవారంగంలో గడుపుతూ తృప్తిని పొందేవాడు ధన్యుడు, భగవత్స్వరూపుడు.

శ్రీవారి సేవ..

కర్ణాటక సంగీత సామ్రాజ్యానికి రాజు త్యాగయ్య. తన కీర్తనలో శ్రీరాముణ్ని స్తుతిస్తూ 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా!' అని కీర్తించాడు. ధనము సుఖాన్నిస్తుందా? రాముని సేవ సుఖాన్నిస్తుందా? అనే భావన వ్యక్తంచేశాడు. ధనం, సంపద అశాశ్వతమైనవి. అవి మనుషుల చుట్టూ తిరుగుతుంటాయి. మనుషులు కూడా వాటిచుట్టూ తిరుగుతుంటారు. శ్రీరాముణ్ని సేవిస్తే శాశ్వత సుఖాలు ప్రాప్తిస్తాయనీ, మోక్షం లభిస్తుందని పై కీర్తన ద్వారా ప్రజలకు మంచి సందేశాన్నిచ్చాడు త్యాగయ్య. నాడు, నేడు భక్తి, ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రజలలో అవగాహన

కల్పించటానికి 'కీర్తనలు' ప్రచార సాధనాలుగా తోడ్పడుతున్నాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీనివాసుడు ముగ్గురూ శ్రీమహావిష్ణువు అవతారాలే. ఈ ముగ్గురు త్రేత, ద్వాపర, కలియుగాలలో భగవత్స్వరూపులు. నేటికీ వీరు ప్రజలకు ఆరాధ్యదైవాలు. అందువల్ల ఎవరికి సేవచేసినా వారిని 'శ్రీవారు' అని భావించటంలో తప్పులేదు. ఇది భారతీయ సంప్రదాయం.

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించి మొక్కుబడులు తీర్చుకోటానికి రోజూ దాదాపు ఎనభైవేల మంది భక్తులు వివిధ ప్రాంతాలనుంచి, వివిధ భాషలకు, వర్గాలకు, వర్ణాలకు చెందినవారు, మహిళలు, వృద్ధులు, యువత, అధికారులు, అనధికారులు విదేశీయులు, వివిధ మతాలవారు తిరుమల, తిరుపతికి వస్తుంటారు. తిరుమల, తిరుపతి దేవస్థానమువారు మానవ వనరులను పెంచుకొని, 'శ్రీవారి సేవ' అనే వినూత్న కార్యక్రమాన్ని 2000 సంవత్సరంలో ప్రారంభించారు. శ్రీవారిని దర్శించు భక్తులకు సేవచేయాలనే సంకల్పం, భక్తిభావం, అంకితభావం ఉన్నవారికి ఈ సదవకాశం తి.తి.దే.కల్పించింది. ఆసక్తిని తెలియపరచిన వారిని 'శ్రీవారి సేవకులు'గా పరిగణిస్తున్నారు. 14 సంవత్సరాల కిందట దాదాపు 200మంది శ్రీవారి సేవకులతో ప్రారంభమై నేడు ఒక లక్షకుపైగా శ్రీవారి సేవకులు వివిధ ప్రాంతాల నుంచి బృందాలుగా వచ్చి పేరు నమోదుచేసుకొని వారంరోజుల పాటు నిస్వార్థసేవలందిస్తున్నారు. భక్తుల క్యూ లైనును క్రమబద్ధీకరించటం, అన్నదాన వితరణ సేవలందించటం, లడ్డు ప్రసాద కౌంటర్లు, లడ్డు టోకెన్లు జారీచేయటం, 'క్యూ'లైనులో ఉన్న వారికి ప్రసాదం, పాలు, మజ్జిగ, తాగునీరు అందించటం నిత్యసేవగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు, నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి,

వేసవి సెలవులు మొదలైన ముఖ్యదినాలలో మరింత ఎక్కువమంది శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకుంటారు. ప్రధాన నగరాలలో నిర్వహిస్తున్న వైభవోత్సవాలు, కల్యాణోత్సవాలలోను శ్రీవారి సేవకుల సేవలను ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన గోదావరి, కృష్ణా పుష్కరాలలో వీరి సేవలు మరువ రానివి. ఇప్పటివరకు ఐదులక్షలమంది శ్రీవారి సేవకులు సేవలందించారు.

సేవకుల ఓర్పు, సహనం...

'క్యూ' లైనులో ఉన్న భక్తులకు సేవలందించటానికి శ్రీవారి సేవకులు ఎండ, వాన, చలిబాధలు మరచి కేవలం భక్తిభావంతో అంకితమై సేవలందించటం సంతోషదాయకం. ఈ సందర్భంలో శ్రీవారి సేవకుల ఓర్పు, నేర్పు, సహనం, సంయమనం, సమయస్ఫూర్తి ప్రశంసనీయం. ఒడిదుడుకులు, తోపులాటలకు అవకాశమివ్వకుండా భగవన్నామస్మరణతో, భక్తి, ఆధ్యాత్మిక స్ఫూర్తిని కల్పిస్తూ భక్తులకు సేవలందిస్తున్నారు. ఏదైనా ప్రయోజనం ఆశించి ఇతరులకు సహాయం చేస్తే దానం లేదా ధర్మం అవుతుంది. కృతజ్ఞత సైతం ఆశించక నిస్వార్థసేవ చేసినదే సేవగా పరిగణించబడుతుంది. సేవ చేసినవారు, సేవల వల్ల లబ్ధిపొందినవారు దేవాలయాలలో ఆధ్యాత్మికభావం, భక్తితత్వం, ధార్మిక స్ఫూర్తి, మానసిక ప్రశాంతత పొందుతారని ప్రాచీన మహర్షులు హితవు పలికారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీవారి సేవకులు, మరింత సేవాభావాన్ని పెంచుకొని, ఇతరులకు స్ఫూర్తిప్రదాతలుగా నిలవాలి. అదే సేవాధర్మ పరమార్థం.

తి.తి.దే.యాజమాన్యం

తి.తి.దే. యాజమాన్యం ఈ బృహత్ సేవాకార్యక్రమాన్ని ముందస్తు ప్రణాళికలతో కడు జాగరూకతతో నిర్వహించటం మెచ్చుకోదగింది. భారీ ఎత్తున సమయ సందర్భాలను, ఉత్సవాలను, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని శ్రీవారి సేవకులను సమకూర్చి యాజమాన్యం వహించటం శ్రమతో కూడినపని. శ్రీవారి సేవా విభాగానికి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారుల ఆదేశాలు, సందేశాలు, ఉపదేశాలు, సూచనలతో ప్రజాసంబంధాల అధికారి పర్యవేక్షణలో, సహాయ ప్రజా సంబంధాల అధికారి సమన్వయంతో సాఫీగా, ప్రతిభావంతంగా నిర్వహించటం ప్రశంసనీయం, శ్రీవారి సేవకులకు తి.తి.దే. యాజమాన్యానికి మధ్య సేవ, భక్తి, ధార్మిక సంబంధాలు, సత్సంబంధాలుగా పరిఢవిల్లుతున్నాయి. ప్రజాసంబంధాల విభాగం ఈ సేవాధర్మ కార్యక్రమంలో వారధిగా కృషిచేసి సఫలీకృతమవుతోందని పరిశీలన ద్వారా వెల్లడైంది. ఏ సంస్థకైనా ప్రజా సంబంధాలే ప్రాణం.

తి.తి.దేవస్థానం శ్రీవారి సేవకులకు ఉచిత వసతి, భోజనం, వైద్యం, రవాణా (తిరుమలలో) మొదలైనవి అందిస్తోంది. సేవచేసే వారికి సేవచేయటం ధర్మం. 'దొరకునా ఇటువంటి సేవ' అని భావిస్తూ స్వచ్ఛందంగా, ఆసక్తితో ప్రజలు శ్రీవారి సేవకు అధిక సంఖ్యలో సప్తగిరులకు తరలిరావటం ఆనందదాయకం, శుభపరిణామం. శ్రీవారి సేవకులకు సకల సదుపాయాలతో 'శ్రీవారి సేవా సదనం' నిర్మించి వసతి గృహం ఏర్పాటుచేశారు తి.తి.దే.వారు.

సేవాభావం విస్తరించాలి

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలోనూ శ్రీవారి సేవా విభాగాన్ని ప్రారంభించారు. శ్రీవారి సేవకులను గుర్తించి భక్తులకు నిస్వార్థ సేవలందించటానికి ఆం.ప్ర. దేవాదాయశాఖ చొరవచూపి, శిక్షణఇచ్చి ప్రణాళికలు సిద్ధంచేయటం ముదావహం. నేడు ప్రజలలో భక్తి, ఆధ్యాత్మిక భావం రోజురోజుకు పెరిగి స్వామి, అమ్మవార్ల దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. నిస్వార్థమైన, ఆధ్యాత్మిక, ధార్మిక విలువలతో భక్తితత్వం ఉన్న వారిని శ్రీవారి సేవకులగా నియమించినపుడే సక్రమంగా, క్రమశిక్షణతో, ప్రశాంత వాతావరణంలో దేవాలయాలలో ఉత్సవాలు, పురాణ ప్రవచనాలు, హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించవచ్చు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దేవాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి. కుటుంబ శ్రేయస్సుకు, వంశాభివృద్ధికి కుటుంబ సభ్యులు దైవారాధన నిత్యం చేస్తారు.

సేవాధర్మం విరాజిల్లాలి..

ఏ కొద్ది సేవచేసినా అది మనలో ఉన్న శక్తిని జాగృతం చేస్తుంది. క్రమంగా మనలో సింహాసదృశమైన బలాన్ని నింపుతుంది. సేవ చేయటం వల్ల మనలో జాగృతమయ్యే అంతఃశక్తితో మనం ఎంతటి విషమ సమస్యలనైనా అవలీలగా ఎదుర్కోగలం. మనసుకు పుష్టి, సంతుష్టి కలిగించే సేవాతత్పరత పెంపొందించుకున్నప్పుడే లభిస్తుంది. సేవచేయటానికి భక్తి విశ్వాసాలు, దయ, సానుభూతి, మానవతా దృక్పథం ఉంటే చాలు, పుష్కలంగా సేవచేయగల అవకాశం కలుగుతుంది. సేవ వలన సంతృప్తితో బాటు భగవంతుడి ఆశీర్వచనం, ఆరోగ్యం, ఆయుర్దాయం, ఐశ్వర్యాలు, మానసిక ప్రశాంతత లభిస్తాయని శాస్త్రవచనం. పంచేంద్రియాలు, కర్మేంద్రియాలు ఇచ్చాడు భగవంతుడు. ఇవన్నీ పరులకు సేవచేయటానికే ప్రసాదించాడని తెలుసుకోవాలి. జరామరణాలు ప్రతి జీవికి తప్పనిసరి. మరణించి కూడా బతికి ఉండటం ఉత్తమోత్తమ జన్మ సంస్కారం. అది సేవాభావం వల్లే వస్తుంది. దేవాలయాల సక్రమ నిర్వహణకు ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, 'నీతి, విలువలు' ఉన్న బృందంగా ఏర్పడి నిస్వార్థసేవ ధర్మాన్ని విస్తరింపజేయాలి. యావత్ ప్రజలు సర్వేశ్వరుడి సేవకులే అనే నినాదం నాలుగు దిక్కులా నినదించాలి. దాన్నే ప్రతిజ్ఞగా మలచుకోవాలి. అది అందరి కర్తవ్యం.

–చివుకుల రమాకాంతశర్మ

కథ

అన్నయ్య

– వాణిశ్రీ

"చెప్పు! ఎందుకు చనిపోవాలనుకుంటున్నావ్?" అడిగాడు వంశీకృష్ణ ఆమె జబ్బ గట్టిగా పట్టుకుని.

"నీకెందుకు చెప్పడం? ఆర్చేవాడివా? తీర్చేవాడివా?" కోపంతో బుస కొడుతూ అన్నది ఆమె.

అతను పకపక నవ్వాడు.

"ఆర్చేవాడిని, తీర్చేవాడిని కూడా! చెప్పు నీ సమస్య ఏమిటో?" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. తర్వాత మౌనం వహించింది.

"నీకు పిల్లలు లేరా?"

"ఇద్దరు పిల్లలు..."

'మరి నువ్వు చనిపోతే వాళ్ల గతి ఏమిటి? వాళ్లని గూడా నీతో తీసుకురావలసింది. అందరూ కట్ట గట్టుకుని పోతే పీడా పోయేది"

అతని మాటలు విని ఆమె వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

"ఏడవడం ఆపి, చెప్పు... ఎందుకు చావాలనుకుంటున్నావో!" అన్నాడు, వంశీకృష్ణ.

ఆమె పేరు సుబ్బలక్ష్మి. ఆమె భర్త రమణయ్య. సగటు రైతు కథే వారిది. ఊళ్లో నాలుగు ఎకరాల పొలం వుంది. పత్తి వేసినప్పుడు మిరపకాయలకు మంచి రేటు వుంటుంది. సరే అని మరుసటి ఏడు మిరపతోట వేసి పండిస్తే పత్తికి మార్కెట్‌లో మంచి రేటు పలుకుతుంది. మిరప కొనేవాడు వుండడు. స్థోమత వున్నవాళ్లు మిరప పంట కోల్డ్ స్టోరేజీలో నిలవ చేసుకుని రేటు వచ్చినప్పుడు అమ్ముకుని బతికిపోతుంటారు. అప్పులు వున్నవాళ్లు అయినకాడికి అమ్మేసి అప్పులు తీర్చి, ఇంకా మిగిలిన అప్పు ఎట్లా తీర్చాలిరా దేవుడా? అని ఏడుస్తుంటారు. మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని గిలగిల కొట్టుకుంటుంటారు, సాలెగూట్లో చిక్కిన ఈగల్లా.

దిక్కు తోచక ఆత్మహత్య చేసుకుంటారు. రమణయ్య కూడా అదే పని చేశాడు. పొలంలో వున్న కుంకుడు చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. బతికిన సుబ్బలక్ష్మిని అప్పులవాళ్లు పీక్కుతింటున్నారు. ఈ బాధకు తోడు ఊరి సర్పంచ్ ఆమెను తనకు లొంగి వుండమని వేధిస్తున్నాడు. అప్పులు తీరే మార్గం చూపిస్తానంటున్నాడు. బ్యాంకు లోన్ ఇప్పిస్తానంటున్నాడు. అతని వేధింపులు తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది.

అంతా విని "ఏ ఊరు మీది?" అని అడిగాడు వంశీకృష్ణ.

"రేగులగడ్డ" చెప్పింది సుబ్బలక్ష్మి.

"నీ కథ అర్థమైంది. నీ భర్త అమాయకంగా షావుకార్ల దగ్గర ఎరువులు, పురుగుమందులు... అని అప్పు చేశాడు. అందులోనే మోసం వుంది. వాళ్ల తీసుకున్నదానికి వడ్డీ, చక్రవడ్డీ అని కలుపుతూ రెట్టింపు చేస్తారు. బ్యాంక్ లోన్ తీసుకుంటే అంత బాధ వుండదు. నీకు బ్యాంక్‌లోన్ ఇప్పిస్తాను. స్వయంగా వ్యవసాయం చేసుకుని నెమ్మదిగా అప్పుల ఊబినుంచి బైటపడు" చెప్పాడు వంశీకృష్ణ.

"కానీ వాళ్లు ఆగడం లేదు. అప్పులు తీర్చమని" గొంతుమీద కూర్చున్నారు.

"నేను వాళ్లతో మాట్లాడతాను. నేను నీ కంటే పెద్దవాడిని, నీకు అన్నలాంటివాడిని. ఎల్లుండి మీ ఇంటికి వస్తాను. నాతో నలుగురు వస్తారు. మాకు మీ ఇంట్లో భోజనం పెట్టు. నన్ను మీ అన్న అని చెప్పు. అప్పులవాళ్లకు చెప్పు, మా అన్న వస్తున్నాడు, మీతో మాట్లాడతాడు అను".

సుబ్బలక్ష్మి తల ఊపింది.

"భోజనం అంటే విందు భోజనం పెట్టాలి. పాయసం, గారెలు, పులిహోరతో. నేను చింతపల్లిలో వుద్యోగం చేస్తున్నాను. ఇటీవలే ట్రాన్స్ ఫర్‌మీద వచ్చాను. ఇంటి భోజనం తిని చాలా రోజులైంది".

"సరే అన్నా! మీకు విందు భోజనం ఏర్పాటు చేస్తాను" అన్నది సుబ్బలక్ష్మి.

"ఇదుగో ఇది వుంచు" అని వెయ్యినోటు జేబులోనుంచి తీశాడు.

"వద్దన్నా! ఆ మాత్రం భోజనం పెట్టలేనా?" అన్నది మొహమాటపడుతూ.

"మామూలు భోజనం కాదు. విందు భోజనం" అని బలవంతాన ఆమె చేతిలో ఆ నోటు వుంచి గుప్పిట మూశాడు, వంశీకృష్ణ.

రేపు ఏం చేయాలో వివరంగా చెప్పాడు.

* * *

ఎరువుల కొట్టు చిన్నపరెడ్డి, మందుల షాపు నాసరయ్య, కిరాణా వ్యాపారి గోపయ్య మధ్యాహ్నం పన్నెండింటికే వచ్చి కూర్చున్నారు, సుబ్బలక్ష్మి ఇంటిముందు. ఆమె అన్న వస్తాడనీ... ఏదో సెటిల్ చేస్తాడని ఆశతో వున్నారు. చింతపల్లిలో ఉద్యోగం అంటే బాగా డబ్బు సంపాదిస్తున్నవాడే అనుకున్నారు.

సర్పంచ్ వెంకటేశ్వర్లు మాత్రం వాళ్లని ఎద్దేవా చేశాడు.

"దాని మాటలు నమ్ముతున్నారా? చింతపల్లిలో ఉద్యోగం చేస్తున్న దాని అన్న ఎవడ్రా నాకు తెలియంది! హైస్కూలు హెడ్‌మాష్టారా? తాశీల్దారా? లేకపోతే పోలీసు ఇన్‌స్పెక్టరా? అందరూ నాకు తెలుసు. మీకేదో మాయమాటలు చెప్పింది".

అదేదో చూద్దాం..! అని వచ్చి కూర్చున్నారు.

ఒంటిగంటకు రోడ్డుమీద దుమ్ము రేపుకుంటూ వచ్చి ఆగింది పోలీస్ వ్యాన్.

వ్యాన్ దిగిన నలుగురు కానిస్టేబుల్స్‌లో ఒకడు వచ్చి ఫ్రంట్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

వ్యాన్ దిగాడు ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ. ఆరడుగుల ఎత్తు ఆజానుబాహుడు. ఎత్తుకి తగ్గ లావుతో చూసేవాళ్లకి హడలెత్తించే విధంగా వున్నాడు. బూట్లు టకటక చప్పుడు చేస్తూ వచ్చాడు. వరండాలో కూర్చున్నవాళ్లవైపు కళ్లెర్రజేసి తీవ్రంగా చూశాడు.

సుబ్బలక్ష్మి లోపల్నుంచి వచ్చి "రా అన్నా!" అన్నది ఆనందంగా.

"ఎవరమ్మా వీళ్లంతా?" అని అడిగాడు.

"నీకు చెప్పానే, వీళ్లే అన్నా!" అన్నది సుబ్బలక్ష్మి.

"వీళ్లా ఆ చీడపురుగులు...!" ఛీత్కారం చేశాడు.

అందరి మొహాలు నల్లగా మాడిపోయాయి, తమని చీడపురుగులతో పోల్చినందుకు. కాని నిజమేగా! అసలు జలగలతో పోల్చాలి.

సుబ్బలక్ష్మి లోపల్నుంచి కుర్చీ తెచ్చి వేసింది. అందులో దర్జాగా కూర్చున్నాడు వంశీకృష్ణ. ఆమె లోపలకు వెళ్లి పళ్లెంలో హారతి తెచ్చింది.

అతను కళ్లకు అద్దుకున్నాడు. ఆమె అతని ముంజేతికి రాఖీ కట్టింది. అతని నోటికి స్వీట్ అందించింది.

వెయ్యి రూపాయల నోటు హారతిపళ్లెంలో వేశాడు.

అంతా నోళ్లు తెరుచుకుని చూస్తున్నారు. చింతపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మికి అన్ననా? తెలీదే!

"బాబోయ్! చచ్చాం!" అనుకున్నారు.

"ఆఁ... ఏంటో చెప్పండి!" కాలుమీద కాలు వేసుకుని దర్జాగా వూపుతూ అడిగాడు, వంశీకృష్ణ.

రమణయ్య చేసిన అప్పుల గురించి వివరంగా చెప్పారు.

సుబ్బలక్ష్మికి చెప్పింది వేరు, ఇప్పుడు వంశీకృష్ణకి చెప్పింది వేరు. సగానికి సగం తేడా వుంది. అదంతా గమనించి నవ్వుకుంది సుబ్బలక్ష్మి. అధికారం ముందు మోసగాళ్లు భయపడతారు. వీళ్ల మాయ, మోసం ప్రయోగించేది అమాయకులమీదే!

"ఇదుగో వినండి... సుబ్బలక్ష్మి అసలు చెల్లిస్తుంది. వడ్డీ గిడ్డీ జాన్తా నై. డబ్బు వచ్చినప్పుడు మీకు కబురు వస్తుంది. ఈ లోపల ఎవరూ గుమ్మం తొక్కగూడదు. అర్థమైందా?"

అందరూ గంగిరెద్దుల్లా తలలు వూపారు.

"మీలో సర్పంచ్ ఎవరు?"

"ఆయన లేడు సార్!"

"సరే పొండి"

అందరూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయారు. సర్పంచ్‌కోసం కానిస్టేబుల్స్‌ని ఇంటికి పంపించాడు.

సర్పంచ్ పరార్. ఇంట్లో లేడన్నారు.

"రేపు చింతపల్లి వచ్చి పోలీస్ స్టేషన్లో కనపడమను. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో వున్న ఆడపడుచుని తనకు లొంగమని వేధిస్తాడా? మనిషేనా?"

సుబ్బలక్ష్మి ఏడుస్తోంది... అదంతా గుర్తొచ్చి.

"చూడమ్మా లక్ష్మీ! ధైర్యంగా వుండు. మెత్తటి వాళ్లని చూస్తే మొత్తబుద్ధవుతుంది వీళ్లకి. ఉంగరాల వేళ్లతో మొట్టాలి. అప్పుడే దారికి వస్తారు. చింతపల్లిలో నీకు బ్యాంక్‌లోన్ ఇప్పిస్తాను. దిగులుపడకు. వచ్చే సీజన్లో ఎరువులు, మందులు, విత్తనాలు అన్నీ డబ్బుతో కొను. అప్పు చేయకు. అప్పుడే వ్యవసాయం గిట్టుబాటవుతుంది. ఒంటరిదాన్నని దిగులు పడకు. నా లాంటి అన్నలు వుంటారు, సహాయం చేయడానికి. పిల్లలున్నారు. వాళ్లని పెంచి పెద్ద చెయ్యడం నీ కర్తవ్యం" చెప్పాడు, వంశీకృష్ణ.

ఏడుస్తూ అతని మాటలు వింటున్న సుబ్బలక్ష్మి కాసేపటికి తేరుకుంది. ..ఆ రోజు చీకటి పడుతూ వుండగా నల్లచెరువు దగ్గరికి వెళ్లింది, చావడానికి.

అక్కడ కొంచెం దూరంలో అతను ఒంటరిగా ఒడ్డున కూర్చుని చేపలు పట్టడానికి గాలం వేసి కూర్చున్నాడు. ఆయనకి అది సరదా కాబోలు! ఆయన వెళ్లిన తర్వాత చెరువులో దూకాలనుకుంది. కానీ ఆయన పసిగట్టి తనను నిలదీశాడు. అదంతా గుర్తొచ్చింది ఆమెకు.

ఆయన ఆ సమయంలో దేవుడిలా వచ్చి కాపాడబట్టి తను ప్రాణాలతో వుంది. లేకపోతే తన పిల్లలు అనాథలైపోయేవాళ్లు. నిజమే! తను పిల్లలకోసమైనా మొండిగా బతకాలి.

సుబ్బలక్ష్మికి ఏదో శక్తి వంట్లోకి ప్రవేశించినట్లయింది. హాయిగా వూపిరి పీల్చుకుంది.

"అన్నా! రండి భోజనానికి" అన్నది కళ్లు తుడుచుకుని.

లోకంలో అందరూ దుర్మార్గులే వుండరు. మంచివాళ్లు, ఆర్చేవాళ్లు, తీర్చేవాళ్లూ వుంటారు. కాలమే సమస్యలను పరిష్కరిస్తుంది. చావు మాత్రం కాదు. ■



హృదయ రంజక కథకుడు 'మధురాంతకం'

మధురాంతకం రాజారాం- 'సాహిత్యం రచయితకు వ్యక్తిత్వాన్ని ఇస్తుందని, దాన్ని రచయిత ఒక తపస్సులాగా నిర్వర్తించి ప్రజాశ్రేయస్సుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని' చెబుతారు. ఈయన 5 అక్టోబరు, 1930లో చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి తాలూకా రమణయ్యగారి పల్లెలో(నేటి పాకాల మండలం) ఆదిలక్ష్మమ్మ, విజయరంగం పిళ్లెల సంతానంగా జన్మించారు. వీరి ప్రాథమిక విద్య పూర్తిగా తమ యాజమాన్యంలో నడుస్తున్న ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్లో జరిగింది. తరువాత 1940వ సంవత్సరంలో రాజారాం చిత్తూరు జిల్లా కేంద్రమైన చిత్తూరులోని జిల్లా బోర్డు హైస్కూల్లో (నేటి పి.సి.ఆర్. కళాశాల) ఎస్.ఎస్.ఎల్.సి.దాకా చదువుకున్నారు.

చదువుకునే రోజులనుంచీ ఆయన సాహిత్యంపట్ల ఆకర్షితుడై ఆధునిక సాహిత్య పాఠకుడిగా కొనసాగారు. ముందు గేయ రచయితగా తన రచనలు ప్రారంభించి, రాష్ట్రంలోనే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప కవిగా పేరు పొందారు. ఆనాటికే రాజారాం 'రౌతు బుక్ డిపో' (రాజమండ్రీ, చెన్నై, కొండపల్లి వీరవెంకయ్య కంపెనీ నుంచి వచ్చే కొవ్వలి లక్ష్మీనరసింహా రావు, జంపన చంద్రశేఖరరావు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, ఎం.అప్పారావు పట్నాయక్.. వంటి ప్రముఖ రచయితల రైల్వే నవలలు(హిగ్గిన్ బాదమ్స్) చదవడం అలవాటు చేసుకున్నారు. హాస్య, శృంగార రసాలతోబాటు జీవన సమస్యలతో వాస్తవానికి దగ్గరగా వుండేవి ఆయన రచనలు.

ఇదే సమయంలో మధురాంతకం రాజారాంగారికి ఆంధ్రపత్రిక(దినపత్రిక), వారపత్రిక, భారతి మాసపత్రికతో పరిచయం ఏర్పడింది. ఈ పత్రికలలో వెలువడే రచనలు, పద్యాలు, గేయాలు రసవత్తరంగా ఉండేవి. దానితో రాజారాంగారికి ఆధునిక సాహిత్యంపట్ల అభిమానం, ఆసక్తి మరింత పెరుగుతూ వచ్చాయి. తాను చదవడంతోబాటు రచనలు చెయ్యాలనే తపన చిన్నతనంలోనే కలిగింది. పద్య రచనకు వెయ్యేళ్ల చరిత్ర ఉన్నందున రాజారాంలో కథ, నవలా రచన చెయ్యాలనే కోరిక బలీయమైంది. 1951లో 'పరమానందయ్య శిష్యులు' అనే ఆయన కథాగేయం ఆంధ్రవారపత్రికలో ప్రచురితమైంది.

ఆనాటినుండి ద్విగుణీకృతమైన ఉత్సాహంతో మధురాంతకంవారు 400 కథలు, రెండు నవలలు, కొన్ని నవలికలు, నాటకాలు, గేయాలు, ఎన్నో సాహిత్య వ్యాసాలు రాస్తూ వచ్చారు. 'రచయిత అనేవాడు కాలక్షేపానికి రాయడు. ఏదో చెప్పాలని ఉండబట్టే తమను వర్ణించమని భావోద్రేకాలు మస్తిష్కంలో రొద ప్రారంభించబట్టే అతడు రాస్తాడు. రచనను ఒక ఆయుధంగా భావిస్తాడని' రాజారాం అంటారు. సృజనాత్మక శక్తి పెరిగేకొద్దీ తార్కిక దృక్పథంగల విమర్శకుడౌతాడని ఆయన ఢంకా బజాయించి మరీ చెప్పేవారు. సాహిత్యం అనేది పూర్తిగా మానవ జీవితానికి, అతడి ఆంతరంగిక ప్రపంచానికి సంబంధించినదిగా భావించే వ్యక్తి రాజారాం. తనకు రచనా విషయకంగా మార్గదర్శనం గావించిన సాహిత్యవేత్తల్లో- ఇల్సా ఎహ్రెన్‌బర్గ్ ఒకరని చెబుతారు. వారి కథా సంపుటాలు.. వర్షించిన మేఘం, ప్రాణదాత, తాను వెలిగించిన దీపాలు, పునర్నవం, కల్యాణ కింకిణి, కమ్మతెమ్మెర, వక్రగతులు మొదలైనవి. వీరి రచన 'చిన్న ప్రపంచం-సిరివాడ' నవల రష్యన్ భాషలోకి తర్జుమా చేయబడి ప్రచురితమైనది. రాజారాంగారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మధురాంతకం నరేంద్ర, తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అకాల మరణం పొందారు. వారి పేరు మధురాంతకం మహేంద్ర. వీరిద్దరూ కవులు, రచయితలు.

5 అక్టోబరు
మధురాంతకం జయంతి

మధురాంతకంవారి మొట్టమొదటి కథ 'కుంపట్లో కుసుమం'. ఉత్తమ కథకుడుగా వారికి 1968లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అనువాద రచనకుగాను తంజావూరు తమిళ విశ్వవిద్యాలయ అవార్డు కూడ పొందడం విశేషం. 1993లో మధురాంతకం రాజారాం-కథలు పుస్తకానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ (ఢిల్లీ) బహుమతి లభించింది. 1994లో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం) గౌరవ డాక్టరేట్, 1996లో అప్పాజోశ్యుల, విష్ణుభొట్ల ఫౌండేషన్ అమెరికావారి ప్రతిభామూర్తి పురస్కారాలు ఆయన పొందారు. కొన్ని పుస్తకాలకు వారు సంపాదకులుగా వ్యవహరించారు. వీరి 'తెలుగు కథకులు-కథన రీతులు' గ్రంథం విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురణగా వెలువడింది. అనేక తమిళ రచనలను తెలుగులో అనువాదం గావించారు మధురాంతకం రాజారాం. వీరి మౌలికమైన కథలు, తమిళ, కన్నడ భాషల్లోకి వాటితోబాటు హిందీ, ఇంగ్లీషు భాషలోకి అనువాదితాలైనాయి. 1995లో జులై-ఆగస్టు మాసాల్లో చికాగో 'తానా' సభల్లో వారు పాల్గొన్న సందర్భంగా ఉత్తర అమెరికా పర్యటన చేసి వచ్చారు. వీరి జీవిత కాలంలో తానొక రచయితగాకన్నా సమాజ కల్యాణమే ధ్యేయంగా రచనలు సాగించారని భావించవచ్చు. సాహిత్యం గురించి రాజారాం చక్కని స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదేమనగా- 'సాహిత్యాన్ని ఇంటిముందు గంగిగోవులా భావించాలేగాని, పచ్చినెత్తురు తాగే పెద్దపులిలా మార్చి సమాజంపైకి వదలకూడదు' అని ఎంతో చమత్కారంగా సెలవిస్తారు. 69 సంవత్సరాల వయస్సులో ఆ మహా రచయిత తన జీవితాన్నే ఒక కథగా ముగించి 1 ఏప్రిల్, 1999లో మరణించారు. వారి కథ 'సన్మానం' అంటే నాకు ఎంతో ఇష్టం. దానిని నేను 'తేజ' వారపత్రికలో గోల్డెన్ స్టోరీస్‌లో ఒకటిగా నా వ్యాఖ్యానంతో పునర్ముద్రించడం జరిగింది. రాజారాంగారి కథలు ఎన్నో పునర్ముద్రితాలై నాయి. అవిశ్రాంత కవిగా, రచయితగా ఆయన ప్రపంచ తెలుగు మహత్తర కథకుడుగా వాసికెక్కారు. నేను నా రెండవ కథాసంపుటి 'జీడికి బంటెవరోయ్'కి ముందుమాట రాసిపెట్ట మంటే 'నాకు స్క్రిప్టు పంపించప్పా! రాసిపెడ్తా!' అన్నారు. మా ఇద్దరి పరిచయం చాన్నాళ్లదైనా తూ.గో.జిల్లా వారు రాజోలుకు వచ్చినపుడు మా ఆత్మీయతలు బలపడినాయి.

– డా॥ మంతెన సూర్యనారాయణరాజు

ఈ వారం కవిత్వం

బాపూజీ

బోసినవ్వుల నేత
మన గాంధీ తాత
బుడతడై పుట్టాడు ఈ రోజు
భరత జాతికే పితయైన మహారాజు.

కడదాక జనులంత కచ్చితత్వం తోడ
చెడును వినుట కనుట మాట్లాడవలదంటూ
మూడు కోతుల వైనాన్ని జగతికి
ముచ్చటైన కథగా చెప్పాడు.

కుళ్లతనము గల్లు తెల్లవారినెల్ల
వెళ్లగొట్టి మనకు స్వేచ్ఛనే తెచ్చాడు
సత్యధర్మనీతి నిత్యము పాటించి
సకల దేశాలకు మహాత్ముడయ్యాడు.

అంతరంగమందు దైవాన్ని స్మరియించి
అంటరానితనం నేరమని చాటాడు
అనురాగబంధాన్ని ఐక్యంగా పెనవేసి
ఆనంద గీతమై సాగమని కోరాడు.

– రాకుమార

మాతృభాష కమ్మదనం

మాతృభాష కమ్మదనం
అమ్మపాలకన్న అతితియ్యదనం

తెలుగుజాతి
తెలుగుమాట
తేనెల తేటనీటి ఊట

మాటతో, తేనెల ఊటతో
రసవాహినిలా సాగే... మన
మాతృభాష

అతి సువిశాలం

దేవభాషకు సమమైన
తెలుగుభాష కమ్మదనంతో
అలతి అలతి కమ్మని పదాల
పెంపు సొంపులతో
దివ్యాతిదివ్యం... నవ్యాతి నవ్యం

అలనాటి పోతన పద్య కవితతో
అన్నమయ్య పద కవితతో
వీనులవిందైన తెలుగు భాష
కమ్మదనం

రసమయమై ఓలలాడించే
మన అద్భుత సారస్వత సాగరం

ఎందరో సాహితీమూర్తులు
మనకందించే అపురూప దివ్యవరం

మన భాషలో... కమ్మని మాటల
తేనెల ఊటలతో
భారత, రామాయణ పారమార్థిక
సంస్కృతసారం నుంచి
తేనెలూరే తెలుగు భాషలో
జాతి తరించేలా
పుణ్య కథలతో పునీతం

తేనెల తేటన్న మాటకు
దర్పణం... మాతృభాష

తెలుగుజాతికే అర్పణం
తేటతెలుగు మాట
తేటతేట తేనెల నీటి ఊట
మన కమ్మని తెలుగుమాట

తెలుగు జాతికే గర్వకారణం
మన తెలుగు పుణ్యజాతికే
పునీతం–

– యలమంచిలి శివాజీ

కవి జీవి(కాగి)తం

సాహితీసేద్యం చేసే కవులు
కలం తీసి కాగితంపై కదిపితే చాలు
నేలను నాగలితో దున్నినట్టుంటుంది.

కాగితంపై చల్లిన అక్షరాలు
జీవితసార ధారతో తడిపితే చాలు
బతుకు మొక్కలు పచ్చగ మొలిచినట్టుంటుంది.

పదాలని పాదులు చేసి నడిపితే చాలు
కాంతులు చిమ్మే సకల భావాల పూలు
కోయిల పాటల కొమ్మల్లో కొలువు దీరినట్టుంటుంది.

వాక్యాల్ని సుతారంగా నిమిరితే చాలు
మధుర ఫలాలైన కావ్యాలు
పూలబుట్టల్లో వరుసలుగా పెట్టినట్టుంటుంది.

సాహిత్యమున్న కాగితం వాసన పీలుస్తే చాలు
లోకంలోని పూలన్నింటి తాజా పరిమళాలు
గుప్పుమని మనల్ని ఒక్కసారిగా కమ్ముకున్నట్టుంటుంది.

కవితలున్న కాగితం ముట్టుకుంటే చాలు
పూలసరం చేతివేళ్లని సున్నితంగా చుట్టుకున్నట్టుంటుంది.

కథలున్న పుస్తకం పట్టుకుంటే చాలు
అలవోకగా లోకమంతా చుట్టినట్టుంటుంది.

కాగితాల్లో కరుణ కనబడితే చాలు
కంటిలోంచి నీరు బొట్టుబొట్టుగ జారడానికి పొంచి
వుంటుంది.

కాగితాల్లో ప్రేమ పొదిగితే చాలు
హృదయాన అనుభూతి కట్టలు కట్టలుగ తెంచుకుంటుంది.

కాగితాల్లో నిన్ను నీవు నింపుకుంటే చాలు
జీవితం అద్దమై నీముందు నిట్టనిలువుగా నిలుచుంటుంది.

– యక్కలూరి శ్రీరాములు

సింగిల్ పేజీ కథ

అలా..ఆ.. ఆదివారం

– కూచిమంచి నాగేంద్ర

“ఏమండీ! లేవండి... టైమ్ ఆరు అవుతోంది” దుప్పటి మీదకు లాక్కుంటు మత్తుగా మాట్లాడుతోంది సుమతి.

“ఈ రోజు ఆదివారమే కదా! ఎందుకు అంత తొందర?” అంటున్న సుబ్బారావుతో–

“మరచిపోయారా... ఆదివారం..”

“అయితే...” “అయితే ఏంటి? ఈ రోజు అయ్యవారు అందరికి వంట చేసి పెట్టాలి” అంటున్న సుమతి మాటలకు...

“మళ్లీ ఆదివారం వచ్చిందా?”

* * *

సుమతి, సుబ్బారావుల పెళ్లై తొమ్మిది సం॥ అయ్యింది. మొదట్లో సుమతి ఇంటి పనులన్నీ చేసేది. పోయిన సంవత్సరం సుమతి డిఎస్సీ పాసై సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పోస్టింగ్ సంపాదించింది. రోజూ తన క్యారేజి, సుమతి, చిన్న, సిరిల లంచ్ బాక్స్, ఇంటిపనులు, వంట పనులతో సతమతమవుతున్న సుమతిని చూసి ఇకనుండి ప్రతి ఆదివారం తానూ వంట పనులు చేస్తానని ప్రామిస్ చేసాడు సుబ్బారావు. ఎప్పుడో కాలేజి చదువు టైములో రూములో నేర్చుకున్న వంట. ఇది రెండో ఆదివారం. మొదటి ఆదివారం ఏదో అయ్యింది అనిపించాడు.

“ఏమండీ! ఈ రోజు పనిమనిషి రానంది. సింక్‌లో వున్న వాటిలో మీకు కావలసినవి తోముకుని వంట చెయ్యండి”

“ఎందుకు రాదట!” వంటింట్లో అడుగిడుతూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. సింక్ అంతా రాత్రి వాడిన సామానులతో నిండిపోయింది. “పోయినసారి ఆదివారం మీరు వంట చేసారు కదా! సోమవారం సెలవు పెట్టింది. ఈసారి ముందుగా మీరు వంట చేస్తారని తెలుసు కాబోలు. ఈరోజు రానని ముందుగానే చెప్పింది”.

“నా వంట తినడంవలన కాదు గదా!” మనసులోనే అనుకుంటు... సామానులు తోమడం మొదలుపెట్టాడు. ఎపుడు లేచాడో సుబ్బారావు కొడుకు చిన్ని “డాడీ! ఏం టిఫిన్ చేస్తావు? నేను తొందరగా క్లాసుకు వెళ్లాలి” “తొందరపడకు నాయనా! ఈ రోజు టమాటో పోస్..పోస్ అనే టిఫిన్ చేస్తాను. అది పూర్వం ఇండియాలో పుట్టి, తరువాత చైనాలో మెట్టి, తిరిగి ఇండియాకు స్టార్ హోటల్‌ద్వారా పరిచయం అయ్యింది.

“ఏమండీ! ముందుగా పాలు తెండి. ఆలస్యం అయితే విరిగిపోతాయి. పైగా నాకు కాఫీ తాగందే ఏమీ తోచదు” సుమతి మాటకు “నీకేమిటి? నాకసలే తోచదు. నేను పాలు తెచ్చేలోపల నువ్వు ఈ గిన్నెలు కడిగి పెడతావు...”

“అబ్బ ఆశ... ఆదివారం నేను ఏ పనీ చెయ్యను. తొందరగా రండి. కాఫీ తాగాలి”

“చేసేదేముంది? ఒప్పుకున్న పెళ్లికి వాయించి తీరాలి...” అనుకుంటూ పాలకి బయలుదేరాడు, సుబ్బారావు. వచ్చీ రాగానే స్టీలుగిన్నె కడిగి, పాలు మరగించి, సుమతి ముందురోజు తీసి వుంచిన డికాషన్‌తో వేడి వేడిగా కాఫీ పెట్టాడు, సుబ్బారావు.

“అబ్బ... కాఫీ అంటే మీరే పెట్టాలండి. ఏమి రుచి అంటూ... ఈరోజు మెనూ ఏమిటి?” అంది.

“ఏముంది! రోజూ నువ్వు చేసినట్టు చేస్తే నా గొప్ప ఏముంది? టమాటో పోస్...పోస్ అనే టిఫిన్, వంకాయ బెల్లం పెట్టి కూర, తోట కూర రైస్, చిక్కుడుకాయల పచ్చడి, కాకర కాయ తొక్కుతో సాంబార్, పెరుగు, అప్పడం...”

“మీరు చెప్పిన వంటలు ఎప్పుడు వినలేదే? తినగలమా? లేక మొన్న ఆదివారంలాగ నేను మళ్లీ చెయ్యాలా?”

“మొన్న ఆదివారం అన్‌ప్రిపేర్డ్‌గా వున్నా. కానీ ఈసారి అలా కాదు”

“టమాటో పోస్...పోస్”కు కావలసిన పదార్థాలు ఏమిటో!”

“రెండు గిన్నెలు, కుక్కరు... చెప్పుకుపోతున్నాడు, సుబ్బారావు.

“నేను అడిగింది పదార్థాలు...”

“అదా! (నాకే ఇంకా తెలీదు... అని మనసులో అనుకుంటు) రెండు టమాటాలు, బాంబినో వెర్మిసెల్లి, గోధుమ నూక, ఉల్లిపాయలు”

“సరే...సరే. అవన్నీ ఇక్కడ పెడతాను. తొందరగా టిఫిన్ కానీయండి. చిన్ని క్లాసుకి వెళ్లాలి.

“నువ్వు తొందరగా స్నానం చేసిరా. టిఫిన్ చల్లారిపోతే బాగుండదు” అంటూ కూతురిని స్నానానికి పంపింది సుమతి.

డ్రెస్ వేసుకుని పుస్తకాలు సర్దుకుని టిఫిన్ కోసం రెడీగా వున్నాడు చిన్ని.

వంట గదిలో నానా హంగామా చేస్తున్నాడు సుబ్బారావు. ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు, టమాటాల తొక్కలతో వంటగది అంతా దీపావళి సామానులు కాల్చిన రోడ్డులా వుంది. ఉల్లిపాయలు తరిగి వున్నాడేమో కళ్ల వెంట నీళ్లు, ముక్కులోంచి నీరు కారుతోంది. భుజంమీది నేప్కిన్‌తో తుడుస్తున్నా ఆగడం లేదు. పైగా ఆ వంటకి తోడు సుబ్బారావు మంచి పాటని హమ్మింగ్ చేస్తున్నాడు.

“అమ్మా! డాడీ వంట చేస్తూ పాటలు కూడా పాడుతున్నారే” అంటున్న కొడుకుతో–

“చూద్దాం! ఆ పాటలు ఎంతవరకు నిలబడతాయో” అంది, సుమతి.

రోజూ ఈ ఆడవాళ్లు ఎలా వంట చేస్తారో గదా! ఒక్క రోజుకే అబ్బా! అనుకుంటూ టమాటో పోస్.. పోస్ పూర్తి చేసాడు, సుబ్బారావు. కొత్తిమీరతో గార్నిష్ చేసి ప్లేట్లలో సర్ది ట్రేలో పెట్టుకుని, డైనింగ్ టేబుల్ మీదకు చేర్చాడు.

“అమ్మా... చూడడానికి బలే బాగుందే” అంటున్న చిన్నిగాడితో–

“తినడానికి ఇంకా బాగుంటుంది” అన్నాడు, సుబ్బారావు. అందరు టమాటో పోస్..పోస్ తినడానికి ఉపక్రమించారు.

“అబ్బా కారం... నోట్లో పెట్టీ పెట్టగానే గావుకేక పెట్టింది, సిరి.

“ఉప్పు సరిపోయి వుండదు. అందరు ప్లేట్లలో కొంచెం ఉప్పు వేసుకోండి. నేను గిన్నెలో తగినంత ఉప్పు వేస్తాను” అంటు టీవీలో ఆయుర్వేద డాక్టరులా కొంచెం ఉప్పు, మిగిలిన టమాటో పోస్...పోస్‌లో కలిపాడు.

“అబ్బా! పసుపు కంపు...” అంటున్న సుమతితో–

“అవును.. ముందు కారం అనుకుని పసుపు వేసాను. అది కొంచెం ఎక్కువైనట్టుగా వుంది. అయినా పసుపు ఆరోగ్యానికి మంచిది”

“ఛ..ఛ.. టమాటో కంపు. అమ్మా! టమాట అసలు ఉడకలేదే!” అంటున్న చిన్నిగాడి మాటలతో–

“వంటలో టమాటాలు ఎప్పుడు వేసారు, అసలు ఉడకలేదు” అడిగింది, సుమతి.

“అదా! ఈ వంటలో గిన్నె దింపి, అప్పుడు ఆఖరున టమాటాలు వేస్తారు.

“మీ మొహం. అసలు మీకు వంట వచ్చా? లేక మా ముందు గొప్పలు చెబుతున్నారా? అంది, సుమతి.

“సుమతీ! నా వంటకు వంక పెట్టకు. టిఫిన్ అంటే ఇలా చేసానుగాని కూరలు, రైస్ అదరగొట్టేస్తాను” అంటున్న సుబ్బారావు మాటలకు–

“అసలు మీరు వంట ఎక్కడ నేర్చుకున్నారు?” అంది.

“ఒకరు నేర్పడం ఏమిటి? ఏకలవ్యుడిలా నాకు నేనే నేర్చుకున్నాను. కాలేజి రోజుల్లో రూములో అందరికి నేనే వండిపెట్టేవాడిని”

“ఎంత మంది వుండేవారు రూములో”

“ఇద్దరం..” అన్న సుబ్బారావుతో–

“ఆ రెండోవారు ఎక్కడ ఉన్నారో!”

“వాడు కాలేజి రోజుల్లోనే నాతో మాట్లాడడం మానేసాడు”

“అవునుమరి. మీ వంట తిన్న తరువాత ఏం చేస్తాడు...పాపం...”

“మీ కాలేజి రోజుల వంట బాగానే వుంది. ఈ వంట తింటే పిల్లలు చదివినట్టే! లేవండి. నేనే చేసుకుంటే బాగుండేది. చిన్నిగాడిని బయట ఏదన్నా తినమని డబ్బులిచ్చి పంపి, వంటకు ఉపక్రమించింది సుమతి.

అలా ఆ ఆదివారం... వంట గదిలోనే గడిచిపోయింది పాపం, సుమతికి. ■

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458

మా ఇంట్లో వాస్తుదోషముందా?

ఎస్ - నర్సాపూర్

ప్రశ్న: మేం ఒక ఇల్లు తీసుకున్నాం. గృహ ప్రవేశం చేసిన సంవత్సరంలోపే మా అమ్మాయి చనిపోయింది. ప్రతిఒక్కరు ఈ ఇల్లే కారణమంటున్నారు. ఎప్పుడూ భయం భయంగా ఉంటుంది. ఇంట్లో పాములు తిరుగుతున్నాయా? అనే భావనే ఎక్కువగా ఉంటుంది. ఇల్లు మా అమ్మాయి పేరుతో వున్నది. ఈ ఇంట్లో మేం ముగ్గురం నివసిస్తున్నాం. నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు.

జవాబు: 1) అయిదు మంగళవారాలు ఉదయం లేదా సాయంత్ర సమయంలో నవగ్రహాలకు 9 ప్రదక్షిణలు గావించండి 2) నెమలి పింఛపు ఈకలు(పొడవైనవి) కొన్ని సేకరించండి. ప్రధాన ద్వారం వున్న గదిలో, పడక గదుల్లో ఏ మూలకయినా సరే(ఈశాన్యం తప్ప) ఒకటి లేదా రెండు ఈకల చొప్పున ఏర్పాటు చేయండి. అటకలపైన కనపడకుండా కూడా ఏర్పాటు చేయవచ్చు. ఇంట్లో పాములు తిరుగుతున్న భావన ఇట్టే మాయమైపోతుంది.

ఇక సీరియస్ సమస్య. మీరు మీ ఇంటివాస్తు ఒకసారి చూపించుకొని జాగ్రత్త పడితే మంచిది. మీకున్న ప్రత్యేకమయిన పరిస్థితులవలన చూపించుకునే వీలు లేకపోతే ఒకసారి ఫోన్‌లో మాట్లాడండి. కొన్ని వివరాలు మీ ద్వారా తెలుసుకుని ప్రత్యామ్నాయ పద్ధతులేమయినా వుంటే వివరిస్తాను. ఇప్పటికే జరిగిన నష్టం పునరావృతం కాకుండా జాగ్రత్త పడవచ్చు.

ఈ ఇల్లు స్కూలుకు యోగిస్తుందా?

రామకృష్ణ - విశాఖపట్నం

ప్రశ్న: పటంలో చూపించిన విధంగా ఈ డాబా ఇల్లు మా స్వంతానికిగాని, స్కూలు వినియోగానికి గాని మేం కొనుగోలు చేయవచ్చా? పూర్తి వివరాలు మాకు తెలియజేయగలరు.

జవాబు: స్థల స్వరూపరీత్యా మీరు ఈ స్థలం కొనుగోలు చేయవచ్చు. స్థల స్వభావ రీత్యా కూడా వాస్తుకు అనుకూలంగా వుండాల్సి ఉంటుంది. అంటే... స్థలం తూర్పు లేదా ఉత్తరం లేదా ఈశాన్యానికి పల్లంగా వుండాలి. ఈ స్థలం హద్దులపైన ఇతరుల నిర్మాణాలుండకూడదు.

మా అక్కగారి పేరు పెట్టవచ్చా?

రమేష్ - అనంతపురం

ప్రశ్న: తూర్పు ఫేసింగ్ స్థలంలో సింగిల్ ఫ్లోర్ బిల్డింగ్ కట్టుకుంటున్నాను. ఈ బిల్డింగ్‌కు చనిపోయిన మా అక్కగారి పేరు పెట్టవచ్చా? తెలుపగలరు?

జవాబు: నిరభ్యంతరంగా ఆమె పేరు మీ భవనానికి పెట్టుకోవచ్చు. కీర్తిశేషుల పేర్లు నిర్మాణాలకు పెట్టుకోవటం అనాదిగా వస్తున్న ఆచారమే! ఇందులో దోషమేమీ లేదు. అయితే ఆ పేరుకు ముందు కీ.శే. అన్న అక్షరాలుండకూడదు. పేరుకు చివరన 'నిలయం' లాంటివి చేర్చవచ్చు. ఉదా: మీ అక్కగారి పేరు అన్నపూర్ణమ్మ అయితే మీ ఇంటికి 'అన్నపూర్ణ' అనిగాని, 'అన్నపూర్ణ నిలయం' అనిగాని పేరు పెట్టవచ్చు.

వాస్తుదోషం లేని స్థలాలుంటాయా?

సురేష్‌కుమార్ - కాకినాడ

ప్రశ్న: ఇంటి నిర్మాణం గావించుకునే స్థలంలోపల వుండకూడనివి ఎన్నో వుండవచ్చు. అవేవీ లేని స్థలాలు వుంటాయా? స్థలంలో వుండకూడనివి వుంటే ఏమి చేయాలి? ఇల్లు కట్టుకోవటం మానేయాల్సిందేనా?

జవాబు: గృహ నిర్మాణ క్షేత్రంలో కొన్ని రకాల వస్తువులు(రాళ్లు, ఇటుకలు, రత్నాలు, రాగి తదితర ధాతువులు) తవ్వకంలో బయట పడినట్లయితే ఎంతో మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. గృహ నిర్మాణ క్రమంలో తవ్వేటప్పుడు చెడు ఫలితాలనిచ్చేవి బయట పడినప్పుడు జాగ్రత్త పడాలి. ఇవి ఎంత ప్రమాణంలో ఆ స్థలంలో నిక్షిప్తమై వున్నాయో పరిశీలించి ఒక నిర్ధారణకు రావలసి ఉంటుంది. చాలా ఎక్కువ ప్రమాణంలో వున్న స్థలమయితే(ఉదా: స్మశానంగా వాడబడిన స్థలం) విసర్జనీయం. ఓ మోస్తరు ప్రమాణంలో బయట పడినట్లయితే మనిషి ఎత్తువరకు అంటే 6 నుండి 8 అడుగుల మేర భూమిని తవ్వి మట్టిని తొలగించటం వలన దోషం తొలగుతుంది. చాలా తక్కువ ప్రమాణంలో వున్నట్లయితే కనిపించినంతవరకు తొలగించి గృహ నిర్మాణం గావించుకోవచ్చు 'ఇలాంటి దోషాలు లేని స్థలాలు అసలుంటాయా?' అన్న మీమాంస అవసరం లేదు. 'భూశోధన'లో ఇలాంటి 'క్షేత్రాంతర్గత' దోషాలు లేని, సత్ఫలితాలనిచ్చే సహజ స్థలాలే ఎక్కువగా కనిపిస్తాయి. దోషపూరితమయిన క్షేత్రంలో నివసించక తప్పనప్పుడు తదనుగుణమయిన బాధలు తప్పవు. దోషపరిహారార్థం 'ప్రత్యామ్నాయ పద్ధతులు' కొన్ని సందర్భాలలో తప్పనిసరిగా ఊరటనిస్తాయి. వాటిని తెలుసుకొని పాటించాలి. క్షేత్ర విషయంలో కాస్త శ్రమిస్తే కనకవర్షమే! ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: --
పుట్టినతేదీ:-------------------- ఊరు: ---------------
జన్మనక్షత్రం:----------తల్లిపేరు:-----------------------
చిరునామా: --
------------------ ఫోన్: ------------------------

కోసుకునే ప్రేమలొద్దు...!

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం
1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com

జి.యస్.వై - కరీంనగర్ జిల్లా

ప్రశ్న: నా వయసు 19. బిటెక్ ఫస్టియర్. ఇంటర్‌లో నా క్లాస్‌మేట్ ఒకతను ప్రస్తుతం నేను చదివే కాలేజీలోనే బి.టెక్‌లో జాయినయ్యాడు. అతను చాలా రోజులుగా నన్ను ప్రేమిస్తున్నాడు. నేను బి.టెక్.లో జాయినయ్యాక తన ప్రేమని అంగీకరించాను. అయితే నాకు ఒక బావ వున్నాడు. అతనికి నన్నిచ్చి పెళ్లి చేయాలని నేను పుట్టినప్పుడే నిర్ణయించారు. అతను అమెరికాలో ఎం.ఎస్. చదవటానికి వెళ్లాడు. అతనికి కూడా నేనంటే చాలా ఇష్టం.

నేను ఇంటర్‌లో వుండగా రెండు సార్లు నా క్లాస్‌మేట్ ప్రపోజ్ చేశాడు. నేను ఒప్పుకోలేదు. బి.టెక్‌లో కూడ నేను చదివే కాలేజ్‌లోనే కావాలని జాయినయి మళ్లీ ప్రపోజ్ చేశాడు. 'నేను మా బావని చేసుకుంటాను. సారీ!' అని చెప్పేశాను. మర్నాడు అతను హాస్పిటల్లో వున్నాడని తెలిసింది. వెళ్లి చూస్తే నేను 'నో' అన్నానని చెయ్యి కోసుకున్నాడని అతని ఫ్రెండ్స్ చెప్పారు.

నేను చాలా బాధపడ్డాను చివరికి ఓకే చెప్పేశాను. అయితే ఈ విషయం సీక్రెట్‌గా వుంచాలని కండిషన్ పెట్టాను. ఎందుకంటే ఈ విషయం తెలిస్తే మా వాళ్లు నా చదువు మానిపించేసి, మా బావని పిలిపించి వెంటనే పెళ్లి చేసేస్తారు. ఆరు నెలలు బాగానే గడిచాయి. వాట్సప్‌లు, సినిమాలు, షికార్లు బాగానే తిరిగాం.

ఈ మధ్య మళ్లీ అతను హాస్పిటల్లో అడ్మిటయ్యాడని తెలిసింది. రెండు రోజులుగా ఫోన్‌లో కాంటాక్ట్ కాకపోతే వాళ్ల ఫ్రెండ్‌ద్వారా తెలుసుకున్నాను. అయితే అతను మళ్లీ చెయ్యి కోసుకున్నాడు. నేను ఆశ్చర్యపోయాను. ఎంత అడిగినా అతను కారణం చెప్పలేదు. నాతో మాట్లాడ్డం తగ్గించాడు. చివరికి తెలిసిందేమిటంటే- అతను మరో అమ్మాయిని ప్రేమించి, ఆమె ఒప్పుకోకపోతే చెయ్యి కోసుకున్నాడని తెలిసి షాకయ్యాను. అడిగాను. అదేం లేదని బుకాయిస్తున్నాడు. ఆ అమ్మాయిని కలిస్తే నిజం తెలిసింది. రెండు నెలలుగా అతను ఆమె చుట్టూ తిరుగుతున్నాడనీ, ప్రపోజ్ చేస్తే ఆమె ఒప్పుకోనందుకే చెయ్యి కోసుకున్నాడని!

అలాంటి వ్యక్తిని నమ్మినందుకు నా మీద నాకే అసహ్యంగా వుంది సర్! అసలు బతకాలనిపించటం లేదు. హృదయం భగ్గున మండుతోంది. ఇప్పుడు నేను ఏ ముఖం పెట్టుకుని మా బావని చేసుకోవాలి? అది మోసం కదా! నిదానంగా మా ఇంట్లోవాళ్లనీ, మా బావనీ ఒప్పించి ఇతన్ని పెళ్లి చేసుకోవాలనుకున్నాను. నా జీవితం ఇలా అవుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. నన్ను ప్రేమిస్తూ, నాతో తిరుగుతూ మరో అమ్మాయికోసం చెయ్యి కోసుకోవటం నాకు డైజెస్ట్ కావటం లేదు. భోజనం తినలేకపోతున్నాను. నిద్ర పట్టడం లేదు. కాలేజ్ మానేసి నెల రోజులయింది. నాకేమయిందో తెలియక ఇంట్లోవాళ్లు కంగారుపడుతున్నారు. జస్ట్ డయల్‌లో మీ వెబ్‌సైట్ చూసి రాస్తున్నాను. ప్లీజ్ హెల్ప్ మీ!

జవాబు: నీ వేదన నాకు అర్థమయ్యింది తల్లీ! చెయ్యి కోసుకున్నాడంటే నీ పట్ల చాలా ప్రేమ వుందని అనుకున్నావు తప్ప తనకి ఇష్టంలేని పని ఏం జరిగినా అతను అలాగే చేస్తాడని గ్రహించలేకపోయావు. నిజమే! జరిగింది మోసమే!

